RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం


PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 13 జూన్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:12


# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణ

**'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట**

**లాజిస్టిక్స్ లోనూ సమర్థవంతంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ వినియోగం**

**'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్'లో మంత్రి శ్రీధర్ బాబు**



గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్ గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్దంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్ లో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందన్నారు. అదే... సముద్ర తీరం లేని రాష్ట్రాల (ల్యాండ్‌లాక్డ్) జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చండైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు. 'తెలంగాణ రైజింగ్ -- 2047' విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితి(లిమిటేషన్)గా కాకుండా, ఒక డిజైన్ అడ్వాంటేజ్ గా మార్చుకుంటున్నామన్నారు. 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్ హౌజింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్డ్ వర్క్ ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ -- ఏ వేర్ హౌజింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్ ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవి కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ ఛైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

**మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి**

**అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి**

**సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశం**

**శనివారం (రేపు) మంచిర్యాలలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి**



సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!

**- కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఓట్ల తొలగింపునకు కుట్ర**

**30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్' పేరిట లేపేసే ప్లాన్**

**- బీహార్, బెంగాల్ ఫార్ములాను ఇక్కడా ప్రయోగిస్తున్నారు**

**- కేంద్ర దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్ష ప్రభుత్వాలపై దాడి**

**- పాలేరు 'బి.ఎల్.ఏ'ల శిక్షణ శిబిరంలో నిప్పులు చెరిగిన మంత్రి పొంగులేటి**



మిగతా 3 లో

ఏదులాపురం మున్సిపాలిటీ : కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రతిపక్ష పార్టీలను, ప్రతిపక్ష ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా బీజేపీపాలితా ప్రభుత్వాలు ఉన్నరాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందనిమండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల (బి.ఎల్.ఏ) అవగాహన శిక్షణ శిబిరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట క్రాస్ రోడ్డులో గల పీవీఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ.

## కోటి 30 లక్షలతో ఇండ్ల నిర్మాణం మంత్రి సీతక్క

వార్తా 10 లో

# జిమ్‌లలో స్టెరాయిడ్ అక్రమ వినియోగం.. సీపీకి ఎమ్మెల్యే లేఖ



హైదరాబాద్, జూన్12: మహానగరంలోని జిమ్‌లలో అక్రమంగా స్టెరాయిడ్ ఇంజెక్షన్ల విక్రయంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర సీపీకి ఎమ్మెల్యే రాజా సింగ్ శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. త్వరగా కండలు పెంచుకోవాలని యువతను కొందరు ట్రైనర్లు, కోచ్‌లు ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఈ ఇంజెక్షన్ల వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమన్నారు. ఇలాంటి జిమ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నగర సీపీని గోషామహల్ ఎమ్మెల్యే కోరారు.

జిమ్‌లలో అనాబాలిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్ల అక్రమ విక్రయం, వినియోగం వేగంగా పెరుగుతోందని రాసిన లేఖలో ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. ఇది యువత ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని తెలిపారు. స్టెరాయిడ్‌ల వాడకం వల్ల గుండె, కాలేయం, హార్మోన్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కొందరు జిమ్ నిర్వాహకులు, ట్రైనర్లు అక్రమంగా ఈ ఇంజెక్షన్ల సరఫరాలో పాల్గొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని నగర పోలీస్ కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ లేఖ ద్వారా తీసుకెళ్లారు.

నగరంలోని జిమ్‌లపై పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించాలని సీపీకి గోషా మహల్ ఎమ్మెల్యే సూచించారు. స్టెరాయిడ్ ఇంజెక్షన్ల సరఫరా, పంపిణీ చేస్తున్న వారిని గుర్తించాలన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే నిందితులపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యువతకు స్టెరాయిడ్‌ల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అక్రమ స్టెరాయిడ్ మాఫియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీని ఎమ్మెల్యే రాజా సింగ్ కోరారు. యువత ఆరోగ్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమని ఆ లేఖలో సీపీ సజ్జనార్‌కు ఎమ్మెల్యే రాజా సింగ్ తెలిపారు.



ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తో సమావేశమైన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్... రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిస్థితులపై చర్చించిన నాయకులు..

ప్రజాబలం

13 జూన్ 2026 శనివారం

# ప్రమాదకరంగా మారుతున్న ఫెర్టిలిటీ రేటు

ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారత్‌పై మరోసారి దృష్టి సారించారు. భారత్‌లో జనన రేటు రీప్లేస్‌మెంట్ లెవల్ కంటే తగ్గిపోయింది. చదువుకున్న, అత్యంత విద్యావంతులైన వర్గాల్లో ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది అని హెచ్చరించారు. 2024లో విడుదలైన లేటెస్ట్ సాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం భారతదేశ టోటల్ ఫర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 1.9కి పడిపోయింది. ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే స్పష్టంగా తక్కువ.నాలుగైదు దశాబ్దాల క్రితం జనాభా గణనీయంగా పెరిగింది. "జనాభా బాంబు" అని ప్రపంచం భయపడిన భారత్ ఇప్పుడు జనాభా తగ్గుదల వైపు వేగంగా పయనిస్తోంది. ఇది మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, భవిష్యత్ రూపురేఖలను పూర్తిగా మార్చగల ఒక మహత్తరమైన మలుపు.1950?60లలో భారత్ ఫర్టిలిటీ రేటు 5.5 నుంచి 6 వరకు ఉండేది. అధిక మరణాల రేటు, వైద్య సదుపాయాల కొరత, వ్యవసాయ ఆధారిత జీవనం, ఉమ్మడి కుటుంబాలు, కుమారుడు సంతానం కోసం అనవసరమైన గర్భాలు ఇవన్నీ పెద్ద కుటుంబాలకు దోహదపడ్డాయి. పిల్లలు కుటుంబానికి శ్రమ బలం మాత్రమే కాకుండా, వృద్ధాప్యంలో భరోసా అని భావించారు. కానీ 1990ల నుంచి సమాజం వేగంగా మారింది. మహిళల విద్య, ఉద్యోగ అవకాశాలు, నగరీకరణ, పిల్లల పెంపకం ఖర్చులు (చదువు, ఆరోగ్యం, హౌసింగ్) ఇవన్నీ చిన్న కుటుంబాల వైపు మనస్తత్వాన్ని మార్చాయి. "ఒక్కడు/ఒక్కతే చాలు" అన్న భావన సామాన్యమైంది. ఫలితంగా 2024లో టీఎఫ్ఆర్ 1.9కు పడిపోయింది.ఇక్కడే మనకు అసలు సవాలు కనిపిస్తుంది. దక్షిణాది మరియు పశ్చిమ రాష్ట్రాల్లో ఫర్టిలిటీ రేటు ఇప్పటికే చాలా తక్కువగా ఉంది (తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు 1.4?1.7 మధ్య ఉండగా, ఢిల్లీ వంటి నగరాలు 1.2 వరకు పడిపోయాయి. అయితే బీహార్ (2.9), ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి ఆరు రాష్ట్రాలు మాత్రమే ఇంకా రీప్లేస్‌మెంట్ లెవల్‌పై ఉన్నాయి. ఈ ప్రాంతీయ అసమానత భవిష్యత్తులో రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.చైనా తన "ఒక్క పిల్లవాడు" విధానంతో యువ జనాభాను తగ్గించుకుంది. ఇప్పుడు అక్కడ వృద్ధుల సంఖ్య భారీగా పెరిగి, శ్రమ శక్తి తగ్గి, ఆర్థిక వ్యవస్థపై భారం పడుతోంది. జపాన్, దక్షిణ కొరియా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ కూడా అదే మార్గంలో నడుస్తుందని మస్క్ హెచ్చరిక. మన దేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అన్న ఆశలు ఇక త్వరలో ముగియవచ్చు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉద్యోగుల కొరత, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఒక తరం మరొక తరానికి సహాయం చేసే సామాజిక చక్రం దెబ్బతినడం ఇవన్నీ రాబోయే దశాబ్దాల్లో మన ముందు నిలబడతాయి. అయినా ఇది పూర్తి విపత్తు కాదు. ఈ తగ్గుదలను పూర్తిగా ప్రమాదంగా చూడకూడదు. ఇది మహిళల సాధికారత, విద్య, ఆర్థిక అభివృద్ధి, కుటుంబ నియంత్రణ అవగాహన వంటి సానుకూల మార్పుల ఫలితం. పిల్లల సంఖ్య తగ్గడం వల్ల ప్రతి పిల్లవాడికి మంచి పోషణ, విద్య, ఆరోగ్యం ఇవ్వడం సాధ్యపడుతోంది. గుణాత్మక జనాభా అన్న లక్ష్యం సాధ్యమవుతోంది.భారత్ ఇప్పుడు ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. జనాభా పెరుగుదల సమస్య నుంచి జనాభా తగ్గుదల సవాలు వైపు మారుతోంది. ఇది భయపడాల్సిన విషయం కాదు, కానీ నిర్లక్ష్యం చేయాల్సిన విషయం కూడా కాదు. సమయం ఉంది.ఫెర్టిలిటీ క్లినిక్‌ల సమాచారం ప్రకారం, ఎగ్ ఫ్రీజింగ్‌లో కీలకమైన 'ఎగ్ రిట్రీవల్ సైకిల్' ప్రక్రియకు క్లినిక్‌ను బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు ఖర్చవుతోంది. అనంతరం అండాలను భద్రపరచడానికి ప్రతి ఏడాది రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఖర్చు ఎక్కువైనా భవిష్యత్తులో తల్లితనాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో మహిళలు ఈ ప్రక్రియను ఎంచుకుంటున్నారు.వైద్యుల సూచనల ప్రకారం, 25 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. 35 ఏళ్లు దాటిన తర్వాత అండాల నాణ్యత, సంఖ్య రెండూ తగ్గే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. హార్మోన్ ఇంజెక్షన్ల వల్ల కొందరిలో ఉబ్బరం, భావోద్వేగ మార్పులు, అరుదుగా అండాశయ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ వంటి సమస్యలు రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా ఉంటుందని వెల్లడించారు.అయితే ఆధునిక విట్రిఫికేషన్ సాంకేతికత వల్ల అండాలను ఎక్కువకాలం నాణ్యత తగ్గకుండా భద్రపరచడం సాధ్యమవుతోందని వైద్యులు తెలిపారు. 25-32 ఏళ్ల మధ్య వయసులో నిల్వ చేసిన అండాలతో భవిష్యత్తులో గర్భధారణ విజయశాతం 60 నుంచి 80 శాతం వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. మహిళల వయసు, అండాల నాణ్యత, శీతలీకరణ పద్ధతులు వంటి అంశాలపై ఈ విజయశాతం ఆధారపడి ఉంటుందని వివరించారు.క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడే మహిళలు చికిత్స ప్రారంభానికి ముందే తమ అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు ఉద్యోగాలు చేసే యువతులు పెళ్లికి ముందే ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించి అండాల నిల్వపై అవగాహన పెంచుకుంటుండటం ప్రస్తుతం నగరాల్లో కొత్త ధోరణిగా మారుతో సరైన విధానాలు, సమగ్ర ఆలోచన, సమతుల్య దృక్పథంతో ఈ మార్పును అవకాశంగా మలచుకోగలిగితే మన భవిష్యత్ తరాలు మన్నించే దేశంగా మారవచ్చు. లేకపోతే, చైనా, జపాన్ మాదిరిగా ఆలస్యంగా బాధపడే దేశంగా మిగిలిపోవచ్చు. సమయం మన చేతిలో ఉంది. ఆలోచనలు మార్చుకునే సమయం ఇదే.

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు



మొదటి పేజీ తరువాయి

సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు.

ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు.

గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ను చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్ను పంపిణీ చేసినట్లు తెలిపారు.

సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.

తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.

రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతా యన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతుల తోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు.

రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు

# నంద్యాలలో... వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన.. భారీర్యాలీ...

**కదం తొక్కిన వైసీపీ శ్రేణులు!?**

**కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజం... మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి**

**డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం.. శిల్పా రవిరెడ్డి సవాల్**

**రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు అండగా.. వైసీపీ**

నంద్యాల .జూన్ 12: నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నంద్యాల నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు....అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని.. అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్....నంద్యాల శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విధ్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు."విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమె త్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చ లేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతాలనికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

# ఓట్ల వేటలో 'కేంద్రం' దొంగదారి!





మొదటి పేజీ తరువాయి

– 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం.. దొంగదారి చర్య!

కేంద్ర ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిన 'ఎస్ఐఆర్' ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో.. అక్కడ ఒక పద్ధతి ప్రకారం దాదాపు 30 నుంచి 35 శాతం ఓట్లను 'ఫేక్ ఓట్లు'గా చిత్రీకరించి, వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోంది. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ **(రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం)** ఉన్నా.. వాటన్నింటినీ వంకగా చూపి ఓట్లను లేపేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీహార్, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలి" అని మంత్రి పిలుపునిచ్చారు.

– నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగిలిస్తున్నారు!

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "మీనాక్షి నటరాజన్ కి కావలసిన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. అయినప్పటికీ కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి, ఎన్నికల అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేశారు. ఈ రకంగా కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన ఒక రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారు. నిన్నటి వరకు ఓట్లను దొంగిలించిన వాళ్ళు.. ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి కేంద్ర ప్రభుత్వం దిగజారింది" అని నిప్పులు చెరిగారు.

– సీబీఐ, ఈడీలతో బెదిరింపు రాజకీయాలు

బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశంలోని ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలను వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్న సీబీఐ , ఈడీ , ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని, వేరే పార్టీల తరఫున గెలిచిన ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నారని, భారతదేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన దుర్మార్గపు పరిపాలన సాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

– ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి..

జూన్ 25 నుంచి జూలై 24 వరకు నెల రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు నిర్వహించే 'ఓట్ మ్యాపింగ్' ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. "ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్ళు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలి. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడ లాగా కాపాడుకోవాలి" అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కాబోయే ప్రధానమంత్రి, మన నాయకుడు రాహుల్ గాంధీకి కార్యకర్తలంతా సైనికుల్లా అండగా నిలబడాలని, ఈ అక్రమ ఎస్ఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బి.ఎల్.ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి BLA పాత్ర కీలకం – – ఎంపీ డాక్టర్ మల్లు రవి



నేడు కొల్లాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో SIR (Special Intensive Revision) కార్యక్రమంపై బూత్ లెవల్ ఏజెంట్లు (BLA\T) కోసం నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దీూాలను ఉద్దేశించి ప్రసంగించిన డాక్టర్ మల్లు రవి , ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో BLA\ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూడటంతో పాటు, తప్పులు లేకుండా ఓటరు జాబితాలను రూపొందించడంలో BLA\T బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

అలాగే కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో BLA\ పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో దీూాలు వారధులుగా పనిచేయాలని, పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు గారు కూడా దీూాలకు పలు సూచనలు చేస్తూ, SIR కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుడు వంశీకృష్ణ , మండల పార్టీ అధ్యక్షులు, గ్రామాల దీూాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 12//06//2026.

## ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం -- చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్.



హైద్రాబాద్ జూన్ 12: అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హై స్కూల్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న అంశం డిప్యూటీ డీఈఓ నిర్వహించిన పరిశీలనలో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అదేవిధంగా అ యొక్క పుస్తకాలను డిప్యూటీవో సీజ్ చేయడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం పుస్తకాల విక్రయం చేపట్టడం పట్ల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బషీర్బాగ్ నగర శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థులు, తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడేలా ఇలాంటి చర్యలు చేపట్టడం సరికాదని ఏబీవీపీ నాయకులు అన్నారు. ప్రభుత్వ విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాల యాజమాన్యంపై వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఏ విద్యాసంస్థ కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయం చేపట్టకుండా విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ విక్రమాదిత్య, నగర కార్యదర్శి సురేందర్, విభాగ్ ూఖీూ కన్వీనర్ సుప్రజ్, నగర ూఖీూ కన్వీనర్ రాహుల్ పాల్గొన్నారు.

## తుంగతుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్స్ (BLA) శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ చామల



తుంగతుర్తి నియోజకవర్గ తిరుమలగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బూత్ లెవెల్ ఏజెంట్స్ (BLA) శిక్షణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది.

తుంగతుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మందుల సామేల్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. బలమైన బూత్ – బలమైన కాంగ్రెస్ అనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పనిచేసి రాబోయే రోజుల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఈ శిక్షణా తరగతులలో బి.ఎల్.ఎ (BLA) ట్రైనర్ కత్తి వెంకటస్వామి పాల్గొని, ఏజెంట్లకు కావలసిన సాంకేతిక, క్షేత్రస్థాయి విధివిధానాలపై సమగ్రమైన శిక్షణ మరియు అవగాహన కల్పించారు.

## కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుబేగంపేట్ ఎయిర్పోర్ట్ లో స్వాగతం పలుకుతున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభ గౌడ్



హైద్రాబాద్ జూన్ 12: సికింద్రాబాద్‌లో నిర్వహించే మేధావుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొనదానికి హైద్రాబాద్ కు చేరుకున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుబేగంపేట్ ఎయిర్పోర్ట్ లో స్వాగతం పలుకుతున్న బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రభ గౌడ్

## ఎస్పీని కలసి తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, రంగయ్యపై పిర్యాదు చేసిన ఎమ్మెల్యే అమిలినేని, టీడీపీ నాయకులు

### తోపుదుర్తిని, రంగయ్యను అరెస్ట్ చేసే వరకు కదిలేది లేదని ఎస్పీ బంగ్లా ముందు భైటాయించిన తెలుగు తమ్ముళ్లు



అనంతపురం కళ్యాణదుర్గం టీడీపీ నాయకులు అనంతపురం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సమక్షంలో జరుగుతున్న సర్ అవగాహన కార్యక్రమానికి వస్తున్న బస్సులపై రంగయ్య సూచనలతో కురుగుంట సమీపంలో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి దగ్గరుండి తన గుండాల ద్వారా బస్సును ఆపి అద్దాలు పగలగొట్టి ధ్వంశం చేశారని, కళ్యాణదుర్గం పట్టణంలో కూడా రెండేళ్ల విజయోత్సవ ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలను రంగయ్య అనుచరులు అడ్డుకోవడం చాలా దుర్మార్గమైన చర్య అని వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు తెలిపారు..రెండేళ్ల విజయోత్సవ ర్యాలీ తిరుపతిలో జరుగుతుంటే రాష్ట్రం మొత్తం టీడీపీ నాయకులు పార్టీ జండాలు, కండువాలు ధరించి విజయోత్సవ ర్యాలీలు చేసుకుంటుంటే వైసీపీ గుండాలు అడ్డుకోవడం చూస్తే ప్రతిపక్షంలో కూడా దాడులకు తెగబడుతున్నారు అంటేనే వారు ఎలాంటి వ్యక్తులో అర్థం చేసుకోవాలన్నారు..నిన్నటి రోజున జగన్ విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితులను పరమార్శించేందుకు వెళ్లి డబ్బులిచ్చి జనాలను తెచ్చుకుని నినాదాలు చేయించుకున్నారని, అలాంటి నాయకులను చూసి ఇక్కడ కూడా అలాగే చేయాలని ప్రయత్నిస్తున్నారని, కానీ మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు అధికారంలో ఉన్నా అలాంటి విష సంస్కృతికి తావు ఇవ్వకూడదని బావించే వ్యక్తి కాబట్టి ప్రకాష్ రెడ్డి అనుచరులు దాడికి పాల్పడిన వారిపై దాడులకు ప్రయత్నించలేదని తెలిపారు..దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ పీ జగదీష్ హామీ ఇచ్చారని తెలిపారు..

# కేంద్రమంత్రి పదవా... గవర్నరా...

విజయవాడ, జూన్ 12, ఢిల్లీలో పర్యటించిన చంద్రబాబుకు కేంద్రంలోని పెద్దలు బిగ్ ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేసేందుకు బీజేపీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న పార్టీల జోరు.. ఇండియా కూటమి వేస్తున్న అడుగులను నిశితంగా గమనిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలు.. ప్రస్తుత కూటమిని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.దీనిలో భాగంగా దక్షిణాదిలో తమకు కీలక పార్టీలుగా ఉన్నటీడీపీ, జనసేనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ప్రధానంగా టీడీపీకి ఒక గవర్నర్ పోస్టును.. లేదా కేంద్ర మంత్రి వర్గంలో మరో బెర్త్‌ను ఆఫర్ చేసినట్టు జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిని ఒక ఎంపీ కూడా ధ్రువీకరించారు. చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు నిర్ణయమే ఫైనల్. మేం రెండూ కావాలని అడుగుతున్నాం. అని ఉత్తరాంధ్రకు చెందిన ఓ ఎంపీ వ్యాఖ్యానించారు.ప్రస్తుత లెక్క ప్రకారం చూస్తే.. టీడీపీకి రెండు మంత్రి పదవులు ఉన్నాయి. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్రంలో మంత్రులుగా ఉన్నారు. ఇక, గవర్నర్‌పోస్టుల విషయానికి వస్తే.. గోవా గవర్నర్‌గా విజయనగరం మాజీ ఎంపీ.. పూసపాటి అశోక్ గజపతి రాజు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో కేంద్రమంత్రి పదవితోపాటు.. మరో గవర్నర్ సీటును కూడా టీడీపీ ఆశిస్తున్న విషయం ఇటీవల కాలంలో చర్చకు వస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమికి టీడీపీ కీలక మద్దతు దారుగా ఉంది.తమకు మరో రెండు పదవులు కావాలని.. కొన్నాళ్లుగా చంద్రబాబు ఢిల్లీ పెద్దలను కోరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా బాబు కోరికను మన్నించి.. కూటమికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని సహా కీలక నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఒక గవర్నర్ లేదా.. ఒక మంత్రి పదవిని ఇస్తామని చెప్పారని తెలిసింది. దీనిపై తన పార్టీ నాయకులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని బాబు కూడా రిప్లయి ఇచ్చారని సమాచారం. ఇక, పార్టీ వర్గాల కథనం మేరకు రెండూ కావాలన్నది చంద్రబాబు ఉద్దేశం. దీనిని ఒప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని కూడా సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## అటు పవన్ కు పక్కా ప్లాన్

జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన వ్యూహాన్ని దాదాపు తేల్చేశారు. రాజకీయంగా తనకు ఉన్న లక్ష్యాన్ని కూడా వివరించారు. దేశాన్ని ఐక్యం చేయడంతోపాటు.. ఉత్తర-దక్షిణ ప్రాంతాలు అనే భేదాన్ని తుడిచి పెట్టి.. అందరూ ఒక్కటే అనే విధంగా దేశాన్ని కలిపి ఉంచాలన్న తన మనసులోని భావాలను వెల్లడించారు. అదేసమయంలో తన టార్గెట్ కూడా కాంగ్రెస్ పార్టీనేనని ఆయన పరోక్షంగా చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ విధానాల కారణంగానే దేశంలో విభజన వాదం వచ్చిందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలను విడదీసినందుకు, తెలంగాణ ఇచ్చినందుకు తనకు బాధలేదన్న ఆయన.. విభజన చేసిన తీరును, ఏపీకి మిగిల్చిన కష్టాలపైనే తన ఆవేదన అని పేర్కొన్నారు. దీనికి మూల కారణం.. కాంగ్రెస్ పార్టీనేనని స్పష్టం చేశారు. అంతేకాదు.. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ చేసిందే ఘోర తప్పిదమని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీని ఆడిపోసుకోవడం సరికాదని పేర్కొన్నా రు. ఆనాడే పార్లమెంటులో చట్టంలో చేర్చి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు.

అంతేకాదు.. పలువురు ముఖ్యమంత్రులు(కాంగ్రెస్) ఉత్తరం, దక్షిణం అంటూ.. దేశానికి గోడలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తన దృక్పథంలో దేశం అంతా ఒక్కటేనని చెప్పారు. దేశ ఐక్యత కోసం.. ఎంతోమంది ప్రయత్నించారని.. కానీ.. కాంగ్రెస్ పార్టీ విభజన వాదాన్ని భుజాన మోస్తోందని చెప్పకనే చెప్పారు. తద్వారా.. పవన్ కల్యాణ్.. తన రాజకీయ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనేనని వెల్లడించడం గమనార్హం. దీనిని బట్టి రాబోయే రోజుల్లో జాతీయస్తాయి కావొచ్చు.. ప్రాంతీయ స్థాయి కావొచ్చు.. పవన్ వ్యూహం.. కాంగ్రెస్‌పైనే ఉంటుందన్న విషయం స్పష్టమవుతోంది.పవన్ వ్యాఖ్యలను నిశితంగా గమనిస్తే.. నిన్న మొన్నటి వరకు లేని ఉత్తేజం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఆయన ఏపీకి, తెలంగాణకు పరిమితమైతే.. తొలిసారి దేశ ఐక్యత, సమగ్ర వ్యూహం.. అన్ని ప్రాంతాలు ఒక్కటేనన్న భావనను వినిపించారు. తద్వారా.. దేశంలోని తటస్థులను ఆయన ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నారన్నది స్పష్టమవుతోంది.

అయితే.. దీనివెనుక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. ఇది పవన్‌ను జాతీయ నేతగా తీర్చిదిద్దినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

# కూటమికి ‘కాపు గర్జన’ సంకేతాలు!

విజయవాడ, జూన్ 12, ఏపీలో కాపులు ఇప్పుడు తెరపైకి వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరిలో కాపుల మహా గర్జన జరిగింది. అయితే ఇది కూటమికి ఒక హెచ్చరిక లాంటిది. ప్రస్తుతం కాపులకు ఉన్న ఏకైక ఆప్షన్ కూడా కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో కాపులు లేరు. ఒకసారి కాపులు ఆ పార్టీని నమ్మారు. జగన్మోహన్ రెడ్డి కొత్తగా ఏం చేయకపోగా.. కాపులకు సంబంధించి వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ పర్యవసానాలే ఆ పార్టీకి కాపులు దూరమయ్యారు. అప్పుడే వారంతా పవన్ కళ్యాణ్ వైపు టర్న్ అయ్యారు. అలా కూటమి వైపు అడుగులు వేశారు. అయితే ఇప్పుడు కూటమి పాలన రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో కాపులు తమ సమస్యలను పరిష్కరించాలని.. తమకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమ బాట పడుతుండడం విశేషం.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో కాపుల ఆలోచన మారే పరిస్థితి లేదు. ఎందుకంటే కాపుల రిజర్వేషన్లు అమలు చేయలేను అంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. అంతకుముందు చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన ఐదు శాతం ఈ బి సి రిజర్వేషన్లను సైతం రద్దు చేశారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ ఆర్థికపరమైన రిజర్వేషన్లను ఐదు శాతం ఇచ్చారు అప్పట్లో చంద్రబాబు. కానీ నేరుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేపట్టారు. అయితే అది రాజకీయ ప్రేరేపిత ఉద్యమమని తదనంతర పరిణామాల్లో తెలుసుకున్నారు కాపులు. అదే ముద్రగడ రాజకీయ ప్రేరేపితంలో భాగంగానే చేశారని ఆయన వైసీపీలోకి వెళ్లిన తర్వాత అర్థం అయింది. అయితే ఇప్పుడు కాపులు ఆర్థికపరమైన రిజర్వేషన్లు ఇచ్చిన కొంతవరకు సంతృప్తి పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అది నెరవేర్చే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న కాపుల ఆందోళన కార్యక్రమాల్లో ఒక అర్థం ఉంది. దానిని అర్థం చేసుకునే పనిలో ఉంది కూటమి ప్రభుత్వం. గత మాదిరిగా ఈ బీసీ రిజర్వేషన్లు ఇస్తే మిగతా సామాజిక వర్గాలు వ్యతిరేకించే అవకాశం లేదు. అయితే గతసారి ఐదు శాతం ఇచ్చారు. ఈసారి మాత్రం 10% ఈ బీసీ రిజర్వేషన్లు ఇవ్వచ్చు. ఆపై నామినేటెడ్ పోస్టులతో పాటు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లో కాపులకు సింహభాగం ప్రయోజనాలు కల్పించవచ్చు. ఒకవైపు సామాజిక వర్గానికి ఆర్థికపరమైన పథకాలు కూడా అందించవచ్చు. సామాజిక వర్గ నేతలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచవచ్చు. మరి ఇంతకంటే ఏం చేయగలరు. అయితే వైసీపీలో ఉన్న కాపు నేతలు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లేవర్ ఉన్న నేతల ప్రకటనలకు భిన్నంగా.. కూటమిని అలెర్ట్ చేసేందుకే ఈ కాపు గర్జనలు అని స్పష్టమవుతోంది. అయితే దీనిని మేల్కొని కూటమి ప్రభుత్వం కాపుల అభిమానాన్ని చూరగుంటే వైసిపి చేసే ప్రయత్నాలు ఏవి ఫలించవు కూడా.

# బైరెడ్డి ప్లాన్ సక్సెస్...

కర్నూలు, జూన్ 12, కర్నూలు జిల్లాకు చెందిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయినట్లు కనిపిస్తుంది. అందుకే టీడీపీ నేతలపై కాలుదువ్వుతున్నారు. మంత్రి టీజీ భరత్ పై ఆరోపణలు చేసి వివాదాన్ని కొని తెచ్చుకున్నారు. వివాదాలతో మరింత హైలెట్ అవుదామని బైరెడ్డి భావించి ఉండవచ్చు. అనుకున్న మైలేజీ వస్తుందని అనుకుని ఉండవచ్చు. అందుకే టీజీ భరత్ పై అవినీతి ఆరోపణలు చేసి గత కొన్ని రోజులుగా మీడియాలో హైలెట్ అయ్యారు. దీంతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అనుకున్న గమ్యానికి చేరుకున్నట్లయింది. అయితే ఆయన వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది స్పష్టం చేయకపోయినా ఈసారి మాత్రం ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఇప్పటి వరకూ ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనలేదు. నందికొట్కూరు నుంచి ఆయన 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని గెలిపించడంలో కీలక భూమిక పోషించినప్పటికీ అది రిజర్వ్‌డ్ నియోజకవర్గం. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజనలో నందికొట్కూరు జనరల్ నియోజకవర్గంగా మారితే అక్కడి నుంచే పోటీ చేసే అవకాశాలున్నాయి. 2004 వరకూ నందికొట్కూరు నియోజకవర్గం జనరల్ లోనే ఉంది. 2009 నియోజకవర్గ పునర్విభజనలో ఎస్.సి. రిజర్వ్ డ్ నియోజకవర్గంగా మారింది. అక్కడ ఒకసారి కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఒకసారి టీడీపీ గెలిచింది. అంతకు ముందు జనరల్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు కూడా టీడీపీ మూడు సార్లు మాత్రమే గెలిచింది. కాంగ్రెస్ ఎక్కువ సార్లు గెలిచిన నియోజకవర్గం. అయితే డీలిమిటేషన్ లో మార్పు జరగకపోతే ఆయన కర్నూలు నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారంతాజాగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మంత్రి టీజీ భరత్ మధ్య తీవ్రమైన రాజకీయ విభేదాలు, వివాదాలు కొనసాగుతున్నాయి.కర్నూలు జిల్లాలోని ఒక ఫార్మా కంపెనీ వద్ద మంత్రి టీజీ భరత్ రూ.45 కోట్లు వసూలు చేశారని, భూకబ్జాలకు పాల్పడ్డారని బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి బహిరంగ సభల్లో తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో టీజీ భరత్ తనపై, తన కుటుంబంపై బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేసి పరువుకు భంగం కలిగించారంటూ కర్నూలు త్రీ-టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ పరువు నష్టం దావా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పోలీసు విచారణకు కూడా హాజరయ్యారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, అవినీతి ఆరోపణలను నిరూపిస్తానని బైరెడ్డి స్పష్టం చేశారు. మరోసారి ఆరోపణలు చేయడంతో టీజీ భరత్ తిరిగి మళ్ళీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో ఆయన కాలు దువ్వుతూ శాసనసభలోకి అడుగుపెట్టాలన్న లక్ష్యంతోనే ముందుకు వెళుతున్నట్లు కనిపిస్తుంది.

# కర్ణాటక నుంచి అనంత...
# వేలాది కోట్ల రూపాయిల పెట్టుబడి

అనంతపురం, జూన్ 12, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది.

బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీపంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. గతేడాది బెంగళూరులో ఉన్న ఐటీ కంపెనీ సీఈవో కష్టాలు చెప్పుకుంటూ ట్వీట్ చేశారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి.. ఏపీకి రమ్మని ఆహ్వానించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ అనంతపురాన్ని కొత్త ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా పేర్కొన్నారు. ఏరోస్పేస్, ఇతర పరిశ్రమలకు ఏపీలో 8వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ ఆహ్వానం పలికారు. లోకేష్ ఇచ్చిన పిలుపు కూడా పరిశ్రమల రాకకు ఓ కారణంగా చెప్పొచ్చు.ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు.. సోలార్, డ్రోన్ పరిశ్రమలు రాగా.. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి మరింత బూస్టప్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తయారు చేయాలని ప్లాన్ చేస్తోంది.. రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగళూరు, కర్ణాటక వెళ్లిన జిల్లా ప్రజలకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. తాజాగా జిల్లాకు వరుసగా పరిశ్రమల రాకతో మరికొన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఇక జిల్లావాసులు ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదంటున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లా భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పెనుకొండలో కియా మోటార్స్ కార్ల తయారీ ప్లాంట్ ఉంది. కియాకు అనుబంధంగా మరికొన్ని అంతర్జాతీయ విడిభాగాలు (స్పేర్ పార్ట్స్) కంపెనీలు ఏర్పాటయ్యాయి. రాప్తాడు దగ్గర రేమండ్ గ్రూప్ రూ. 1,200 కోట్ల పెట్టుబడితో ప్లాంట్లు ఏర్పాటు చేయబోతోంది. హిందూపురం, పెనుకొండ ప్రాంతంలో ప్రముఖ ఇన్నర్ వేర్ బ్రాండ్ అయిన జాకీ తయారీ యూనిట్ వచ్చింది. సరళా ఏవియేషన్ రూ. 1300 కోట్లతో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అలాగే రక్షణ, విమాన పరికరాల తయారీకి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ రూ. 1,150 కోట్ల పెట్టుబడితో బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్‌ను తిమ్మసముద్రంలో ఏర్పాటు చేస్తోంది. అలాగే హిందూపురం ఇండస్ట్రియల్ ఏరియాలో ఆర్జాస్ స్టీల్ స్టీల్ ఉత్పత్తులను తయారు చేస్తోంది.

పుట్టపర్తి సమీపంలో ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ భారీ సెమీకండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.పుట్టపర్తి సమీపంలో డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. గత నెలలోనే పుట్టపర్తిలో కేంద్ర ప్రభుత్వం ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది.

రూ. 15,803 కోట్లతో యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 600 ఎకరాలను కేటాయించింది. ఈ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ద్వారా దాదాపు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు రూ. లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అనంతపురం జిల్లా రాబోయే రోజుల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందని చెబుతున్నారు.

# అక్షయ పాత్రలా మారిన టీటీడీ నిత్యాన్నదానం

తిరుమల జూన్ 12, తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమం అక్షయ పాత్రలా మారింది. అన్నప్రసాద సేవ 15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతోంది. రోజుకు దాదాపు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నారు. 2026 జనవరి నుంచి మే వరకు 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్ చేశారు. ఆధునీకరణతో విస్తరిస్తున్న అన్న ప్రసాద సేవలు నిర్వహిస్తున్నారు. అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వచ్చే భక్తులకు టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిత్యం మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. నిత్యం దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని టీటీడీ ఉచితంగా అందిస్తోంది. తిరుమలలో 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. తిరుమలలో సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారు.. అదే వీకెండ్ అయితే 3 లక్షలకు మించి భక్తులు ఉంటారు.శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ భక్తుల విరాళాలతో నిర్వహిస్తున్నారు. టీటీడీ దగ్గర ప్రస్తుతం రూ.2,500 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధుల ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తోంది. శ్రీవారి సన్నిధిలో ఆకలితో వచ్చే ప్రతి భక్తునికి తృప్తికరమైన భోజనం అందించడం ద్వారా టీటీడీ అన్నప్రసాద సేవలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. టీటీడీ భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తోంది. 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. రోజుకు 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 4,375 కొబ్బరికాయలు, 209 కిలోల ధనియాలు వంటి ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు మూడు నెలలుగా చూస్తే.. రోజుకు దాదాపు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటివి టీటీడీ భక్తులకు అందిస్తోంది. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం అందిస్తున్నారు. ఇలా చూస్తే రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా 2026 జనవరి 1 నుంచి మే 31 వరకు మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినారు. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్‌లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్న ప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. మాతృశ్రీ తరిగొండ వెం౦ ˆమాంబ అన్న ప్రసాద కేంద్రంలో రోజుకు 82 వేల మందికి పైగా భోజనాలు అందిస్తున్నారు. శ్రీ అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కాంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల బయట ఏర్పాటు చేసిన కేంద్రాలు, ఖంఅ అన్నప్రసాద భవనాలతో పాటుగా ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు.టీటీడీ అన్న ప్రసాదం నాణ్యతను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టింది. చట్నీలు, కూరల తయారీలో తాజా కొబ్బరికాయల వినియోగిస్తున్నారు. 2024లో వకుళమాత సెంట్రలైజ్డ్ కిచెన్‌ను ప్రారంభించి అదనంగా 28 ప్రాంతాలకు ఆహార పంపిణీ సేవలను విస్తరించింది. కొత్తగా ప్రారంభించిన ఖంఅ-5 (వెంకటాద్రి నిలయం)లో సుమారు 1,500 మంది ఒకేసారి భోజనం చేసే సామర్థ్యంతో కొత్త డైనింగ్ హాల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. రోజుకు 2 లక్షల మంది భక్తులకు ఆహారం తయారు చేయగల సామర్థ్యంతో కొత్త శాటిలైట్ ఆటోమేటెడ్ కిచెన్ నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయి. కిచెన్‌లో ఆధునిక వంట పరికరాల ఏర్పాటు, ఖిఖీకోడ్‌ఆధారిత విరాళాల సేకరణ కియోస్క్‌ల ఏర్పాటువంటికార్యక్రమాలు కూడా చేపట్టారు.

# అంతుపట్టని జేసీ వ్యూహం

అనంతపురం, జూన్ 12, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏదీ మనసులో దాచుకోరు. మైకులో ఉన్నది ఉన్నట్లు చెప్పేస్తారు. ప్రత్యర్థులకు వార్నింగ్ లు ఇచ్చినా, తమ పార్టీ నేతలకు ఆదేశాలు ఇచ్చినా అన్నీ ఓపెన్ గానే ఉంటాయి. ఏదీ గుట్టుగా చేయరు. రహస్య ఆదేశాలు ఇవ్వరు. జేసీ ప్రభాకర్ రెడ్డి స్టయిల్ అంతే. అందుకే తరచూ వివాదాల్లోకి జేసీ కూరుకుపోతుంటారు. అయినా లెక్కచేయరు. సొంత పార్టీతో పాటు ప్రత్యర్థులను కూడా ఆయన కేర్ చేయరు. తనకు తాడిపత్రి మినహా మరొకటి అవసరం లేదన్నట్లు ఆయన వ్యవహార శైలి కొనసాగుతుంది. అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించడంలోనూ ఆయనకు ఆయనే సాటి.తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పై మాటల దాడి చేశారు. ఇంటికి వచ్చి నరుకుతా అంటూ ఓపెన్ గా మైకులోనే జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో పాటు కేతిరెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేయడం కూడా పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే కాదు. ప్రస్తుతం మున్సిపల్ ఛైర్మన్ కూడా కాదు. కానీ నియోజకవర్గంలో తాను చెప్పిందే జరగాలన్నది ఆయన ఆకాంక్ష. అందుకు పోలీసులయినా.. ప్రత్యర్థులయినప్పటికీ ఎవరినీ వదలిపెట్టరు. అదే ఇప్పుడు పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో పాటు అంతకు ముందు ఆయన చేసిన హెచ్చరికలు కూడా సోషల్ మీడియాలో వైసీపీ నేతలు వైరల్ చేస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల చేత నామినేషన్లను కూడా వేయించకుండా అడ్డుకోమని బహిరంగంగానే తన పార్టీ నేతలకు జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. నామినేషన్లు వేస్తే అడ్డుకోవాలని, అంతకు ముందే వారి ఇళ్లకు వెళ్లి వార్నింగ్ ఇవ్వమని చెప్పడంతో జేసీ అనుచరులు వైసీపీ నేతల ఇళ్లకు వెళ్లి హంగామా చేసి వచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తమను గెలవకుండా అడ్డుకున్నారని, పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తమను స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఇప్పుడు ఆ బాధ వారికి రుచిచూపించాలని పిలుపు నివ్వడం చర్చనీయాంశమైంది. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి పదే పదే చేసిన వ్యాఖ్యలు పార్టీకి తలనొప్పిగా మారాయి.

# జగ్గంపేటలో పోలీసుల యోగాసనాలు



కాకినాడ పోలీస్ దినచర్యలో భాగంగా శుక్రవారం ఉదయం జగ్గంపేటలోని డిగ్రీ కళాశాల, కాపు కళ్యాణ మండపం ప్రాంగణంలో జగ్గంపేట సీఐ బి. తిరుపతిరావు,జగ్గంపేట ఎస్సై టి. రఘునాధరావు,గండేపల్లి ఎస్సై యువి.శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్సై జి సతీష్ కుమార్ సిబ్బందితో యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ....యోగా అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సును చేకూర్చే ఒక అమూల్యమైన జీవన విధానం అన్నారు. ఆధునిక ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని జయించి, సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించడానికి యోగా ఎంతో ప్రాముఖ్యమైనదన్నారు.

శరీర దృఢత్వం, వశ్యత: విభిన్న ఆసనాలు వేయడం ద్వారా కండరాలు బలాన్ని పుంజుకుంటాయి మరియు శరీరం సులువుగా వంగుతుందన్నారు.

రోగనిరోధక శక్తి పెంపు: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల శరీర నిరోధక శక్తి పెరిగి, వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుందన్నారు..

# జాతీయస్థాయిలో పవన్ ...

కాకినాడ, జూన్ 12, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జనసేన పార్టీ, ఇప్పుడు జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఈ నెల 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు జనసేన పార్టీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా ఈ సమావేశాలకు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్న జనసేన సిద్ధాంతాలను, భావజాలాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఈ పర్యటనను ఒక వేదికగా మలుచుకోనున్నారు.ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం సేన గళం . సమాజంలో బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పెంపొందించడం, కుల రాజకీయాలకు అతీతంగా అభ్యుదయ భావాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ ఇటీవలే ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నేటి తరం యువత జెన్ జీ ఆకాంక్షలకు అనుగుణంగా, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా ఈ సేన గళం పనిచేయనుంది. ఈ వేదిక ముఖ్య ఉద్దేశాలు, ఆశయాలను జాతీయ మీడియా ద్వారా దేశ ప్రజలకు పవన్ కల్యాణ్ వివరించనున్నారు.ఢిల్లీ పర్యటన కోసం జనసేన పార్టీకి చెందిన సుమారు 150 మంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు తరలివెళ్లనున్నారు. దేశ రాజధానిలో జనసేన క్యాడర్ ఇంత పెద్ద ఎత్తున ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారి. మూడు రోజుల పాటు జరిగే ఈ విస్తృత స్థాయి సమావేశాల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణ మరియు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలలో పార్టీ విస్తరణపై పవన్ కల్యాణ్ లోతుగా చర్చించనున్నారు. పాతకాలపు బూజుపట్టిన కుల రాజకీయాలను, వ్యక్తిగత దూషణల సంస్కృతిని పక్కనపెట్టి.. వాస్తవాలు, ప్రజాహితం ఆధారంగానే రాజకీయాలు సాగాలన్నదే పవన్ కల్యాణ్ ఆలోచన. ముల్లును ముల్లుతోనే తీయాలి.. ఒక కులం వారు విమర్శిస్తే అదే కులం వారితో తిట్టించాలి" అనే పాత ధోరణికి స్వస్తి పలకాలని 'సేన గళం' ద్వారా ఆయన పిలుపునిచ్చారు. ఈ వినూత్న పొలిటికల్ ఫిలాసఫీని జాతీయ స్థాయిలో ప్రజలకు పరిచయం చేయడం ఈ ఢిల్లీ టూర్ ప్రధాన ఎజెండా.ఢిల్లీ పర్యటన ముగింపు రోజున పవన్ కల్యాణ్ జాతీయ స్థాయి నేతలతో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేనకు ఇటీవల ఏపీలో ఒక రాజ్యసభ స్థానం కూడా దక్కడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. జాతీయ స్థాయిలో జనసేన గళాన్ని బలంగా వినిపించడానికి, దేశ రాజధానిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడానికి ఈ 3 రోజుల ఢిల్లీ సమావేశం ఒక మైలురాయిగా నిలుస్తుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందాలి సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు."బాల్యం ప్రతి చిన్నారి జన్మహక్కు. చదువుకోవడం, ఆడుకోవడం, ఆనందంగా ఎదగడం, తమ కలలను సాకారం చేసుకునే అవకాశాలు పొందడం ప్రతి పిల్లవాడి సహజ హక్కు. ఆ హక్కులను హరించే బాల కార్మిక వ్యవస్థకు సమాజంలో చోటు లేకుండా చేయడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదే సమయంలో కుటుంబాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి పౌరుడు ఈ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.బాల కార్మిక వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదని, ఎక్కడైనా చిన్నారులు పనుల్లో నిమగ్నమైనా, కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఒక చిన్నారిని బాల కార్మికత్వం నుంచి బయటకు తీసుకురావడం అంటే అతనికి లేదా ఆమెకు ఒక కొత్త భవిష్యత్తును అందించినట్టేనని పేర్కొన్నారు."పిల్లల చేతుల్లో పనిముట్లు కాదు.. పుస్తకాలు ఉండాలి. వారి భుజాలపై భారం కాదు.. భవిష్యత్తుపై ఆశలు ఉండాలి. ప్రతి చిన్నారి నవ్వుతూ, నేర్చుకుంటూ, కలలు కంటూ ఎదిగే తెలంగాణను నిర్మించడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

## వెస్ట్ బెంగాల్లో కాలిపోయిన 4,000 ఈవీఎంలు

కోల్కతా వెస్ట్ బెంగాల్ లో సంభవించిన అగ్ని ప్రమాదంలో దాదాపు నాలుగు వేల ఈవీఎంలు కాలిపోయాయి. అలీపుర్లోని 9 అంతస్తుల ప్రభుత్వ భవనంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఈవీఎంలు దహనం అయ్యాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 10 నియోజకవర్గాలకు వాడిన ఈవీఎంలుగా గుర్తించారు.

## మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నాదెండ్ల మండలంలోని గణపవరం మెయిన్ సెంటర్ సమీపంలోని సీఆర్ కాలేజ్ వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ వైపు నుంచి వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి.స్థానికుల కథనం ప్రకారం, బస్సు అతివేగంగా రావడమే ప్రమాదానికి ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు.

# 14న కాక్ రోచ్ పార్టీ నిరసన

హైదరాబాద్, జూన్ 12, దేశ రాజకీయాల్లో ' కాక్రోచ్ జనతా పార్టీ ' ఓ సంచలనం. ఓ కేసులో నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్న జీవులు'తో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పోల్చడంతో సీజేపీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫోలోవర్లు వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్ల మంది ఫాలోవర్లకు చేరుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో అసంతృప్తి ఎలా ఎగిసిపడుతుందనడానికి ఇదే ఓ మచ్చు తునక. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాజధానిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో మొదటిసారి ప్రత్యక్ష నిరసన చేపట్టారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ దేశవ్యాప్త ఆందోళన చేపడతామని ఆ ధర్నాలోనే దీప్కే ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలి నిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన 'గోయింగ్ నేషనల్' ఉద్యమంలో ఈ ఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు.అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందని తెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో, పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించింది.ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.ఇటీవలి నిరసనలలో విద్యార్థులు, యంగ్ ప్రొఫెషనల్స్, పౌర సమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు కూడా హాజరైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వీరిలో చాలామంది మాస్కులు ధరించి, ప్లకార్డులతో నిరసనలలో పాల్గొనడం సీజేపీకి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నిరసనలు దక్షిణాదికి కూడా విస్తరిస్తున్నందున జూన్ 20న ఢిల్లీలో జరిగే ముగింపు ర్యాలీకి ముందు దేశవ్యాప్తంగా ఊపును తీసుకొచ్చేందుకు సీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.

# 824 నియోజకవర్గాల పెంపునకు ఈసీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, జూన్ 12, (న్యూస్ పల్స్) దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59 నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది.కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 80 స్థానాలు 120కు పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. చిన్న నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజాప్రాతినిధ్యం మరింత మెరుగుపడటంతో పాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం సుమారు 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది.ఇక పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా 'మహిళా పోలింగ్ బూత్‌లు' ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. అలాగే 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## కడప సెంట్రల్ జైలు జీవిత ఖైదీ పరార్


గూడూరు కడప సెంట్రల్ జైలు లో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీ పరారయ్యాడు. నంద్యాల కానిస్టేబుల్ హత్య కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కుమార్ మరియు పోక్సో కేసులో 20 ఏళ్లు జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. అనారోగ్య కారణాల వల్ల ఏప్రిల్ నెలలో విశాఖ మానసిక ఆసుపత్రికి తరలించి, తిరిగి జైలుకు తరలిస్తుండగా గూడూరు రైల్వే స్టేషన్లో తప్పించుకుని పారిపోయాడు. నిందితుడు కోసం పోలీసులు గాలింపులు ప్రారంభించారు.

# 19న హైదరాబాద్ కు పవన్...

హైదరాబాద్, జూన్ 12, ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎంత యాక్టీవ్ గా ఉన్నాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకపక్క పాలన పరంగా తనదైన మార్కు తో ముందుకు వెళ్తూ , మరోపక్క జనసేన పార్టీ ని బలోపేతం చెయ్యడానికి అన్ని విధాలుగా ప్లానింగ్ చేస్తున్నాడు. జనసేన పార్టీ ని కేవలం ఆంధ్ర ప్రదేశ్ కి మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రాంతానికి కూడా విస్తరింపజేసే ప్రయత్నం చేస్తున్నాడు. రీసెంట్ గా పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సృష్టించిన అలజడి ఎలాంటిదో కళ్లారా చూసాము. కావాలని ఆయన్ని టార్గెట్ చేస్తూ , కాంగ్రెస్ పార్టీ జనసేన క్యాడర్ ని , జనసేన నాయకులను తెలంగాణ వ్యాప్తంగా యాక్టీవ్ అయ్యేలా చేసింది. ఒకపక్క తెలంగాణ పై తన ఫోకస్ ప్రస్తుతానికి లేదని పవన్ కళ్యాణ్ చెప్తూనే , మరోపక్క అక్కడ ఆ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సిద్ధం అవుతున్నాడు.అందులో భాగంగా ఈ నెల 19 న ఆయన తెలంగాణ లో జనసేన పార్టీ పీకార్యాలయాన్ని గ్రాండ్ గా ప్రారంభించబోతున్నట్టు సమాచారం. ఏ ప్రాంతం లో ఆయన ఈ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నాడు అనేది ప్రస్తుతానికి తెలియదు. మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. పవన్ కళ్యాణ్ కి ప్రస్తుతం తెలంగాణ మీద ఆసక్తి లేకపోయినప్పటికీ,జనసేన పార్టీ క్యాడర్ మాత్రం ఒప్పుకోవడం లేదు , ఎట్టి పరిస్థితిలోనూ తెలంగాణ లో జనసేన పార్టీ ని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిందే అని పవన్ పై ఒత్తిడి తెస్తున్నారు. అందుకే వాళ్ళ కోసం ఆయన ఇకపై తెలంగాణ పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ఆయన రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడడం చూస్తుంటే , రాబోయే రోజుల్లో ఆయన అధికార కాంగ్రెస్ ని చాలా గట్టిగానే టార్గెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో చూడాలి.

# రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన సహకరిస్తున్నవారికి ధన్యవాదాలు

## సీఎం చంద్రబాబు



అమరావతి ఐదు కోట్ల మంది ప్రజల అపార నమ్మకంతో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి నేటికి సరిగ్గా రెండేళ్లు. గత ప్రభుత్వం సవాళ్లు, సంక్షోభాలు, సమస్యలను వదిలి వెళ్తే... అన్నింటినీ అధిగమిస్తూ సంక్షేమం?అభివృద్ధి?సుపరిపాలన అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

అధికారాన్ని బాధ్యతగా, పాలకులు అంటే సేవకులుగా భావిస్తూ పనిచేస్తున్నాం. ప్రతి పౌరుడిని, ప్రతి కుటుంబాన్ని, ప్రతి వర్గాన్ని గెలిపించడమే అజెండాగా పని చేస్తున్నాం. వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ... రాష్ట్ర భవిష్యత్తు బాటలు వేస్తున్నాం. రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రాభివృద్ధిలో అడుగడుగునా సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ కి, కేంద్ర ప్రభుత్వానికి ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నాను. అటు కేంద్ర ప్రభుత్వ సహకారం, అటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు.

ఈ రెండేళ్ల ప్రయాణంలో అండగా ఉన్న రాష్ట్ర ప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతున్నాను. రానున్న రోజుల్లో మరెన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసేందుకు ప్రజల మద్దతు, సహకారం కోరుతూన్నాని అన్నారు.

# మళ్లీ కవ్విస్తున్న పాకిస్తాన్

న్యూఢిల్లీ, జూన్ 12, (న్యూస్ పల్స్) గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి పాకిస్థాన్ నెత్తినోరూ మొత్తుకుంది. బ్బాబ్బాబూ మమ్మల్ని వదిలేయండి మీకు దండం పెడతాం అంటూ కాళ్లు పట్టుకుంది. చచ్చిన పామును ఏం చంపుతామని భారత్ బతుకుపో అంటూ వదిలిపెట్టింది. లేకుంటేనా పాకిస్థాన్ ప్రపంచ పటంలో ఉండేదే కాదు.భారత్ దయాదాక్షిణ్యాల మీద బతికిన పాకిస్థాన్ మళ్లీ పిచ్చి లేసిన కుక్క లాగా అరవడం మొదలుపెట్టింది. సరిహద్దుల్లో మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నిబంధనలు అతిక్రమించి జమ్మూలో భారత సైన్యం ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టుల ప్రాంతాలలో పాకిస్థాన్ సైన్యం ఈనెల 9న తెల్లవారుజామున డ్రోన్లను పంపించింది.ఆ డ్రోన్లను కూల్చివేయడానికి భారత సైన్యం 15 రౌండ్ల పాటు కాల్పులు జరపాల్సి వచ్చింది. అయితే ఆ డ్రోన్లు మళ్లీ పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లిపోయాయి. ప్రతిసారీ నిబంధనలు అతిక్రమించడం పాకిస్థాన్ కు అలవాటే. కాకపోతే పహల్గాం ఘటన తర్వాత భారత్ కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేస్తోంది. సరిహద్దుల్లో చీమచిటుక్కుమన్నా తెలిసేలా సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. అందువల్లే పాకిస్థాన్ డ్రోన్లపై భారత్ కాల్పులు జరిపింది.ఇలాంటి పనులు పాకిస్థాన్ ఎందుకు చేస్తోందంటే..ప్రస్తుతం పాకిస్థాన్ లో అంతర్గత సంక్షోభాలు ఏర్పడ్డాయి. భారత్ జీలం, చినాబ్ నది ప్రవాహాలకు అడ్డుకట్ట వేసింది. దీంతో పాకిస్థాన్ లో వ్యవసాయం సాగే పరిస్థితి లేదు. పీవోకే లో పాకిస్థాన్ కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బలూచిస్థాన్ ఆర్మీ పాకిస్థాన్ కు చుక్కలుచూపిస్తోంది. ఆర్థిక సంక్షోభం కూడా పాకిస్థాన్ పాలకులను కలవరపాటుకు గురి చేస్తోంది.ఇవన్నీతగ్గిపోవాలంటే ఏదోఒకటి చేయాలి. భారత్ మీద దాడులు చేసినట్టు కలరింగ్ ఇస్తే అంతర్గత సంక్షోభాలను డైవర్ట్ చేయవచ్చని పాకిస్థాన్ భావిస్తోంది. అయితే ఆపరేషన్ సిందూరు జస్ట్ శాంపిల్ మాత్రమేనని..ఈసారి పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వితే.. లేపడానికి కాలు..దువ్వాడానికి చేయి ఉండవని భారతసైన్యం స్పష్టం చేస్తోంది. అంటే ఈలెక్కన పాకిస్థాన్ దేశాన్నిప్రపంచ పటం నుంచి తీసివేయడానికి భారత్ గట్టిగా ఫిక్స్ అయిందన్నమాట.

# సిటీలో డేంజర్ బిల్డింగ్స్ 377

హైదరాబాద్, జూన్ 12, మహానగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎప్పుడు ఏ పాత భవనం లేదా ప్రహరీ గోడ కూలిపోతుందోనని నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిర్మాణంలో ఉన్న సెల్లార్ల వద్ద మట్టి దిబ్బలు కూలి కార్మికులు చిక్కుకుపోయే ప్రమాదాలు పొంచి ఉండటంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నగర ప్రధాన ప్రణాళికాధికారి కె. శ్రీనివాస్ జోన్ల వారీగా ప్రత్యేక సర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారుల నుండి సేకరించిన వివరాల ప్రకారం, జూన్ 5 నాటికి నగరవ్యాప్తంగా మొత్తం 377 శిథిల భవనాలు ఉన్నట్లు లెక్క తేలింది. ఈ సర్వే ఇంకా కొనసాగుతోందని, మరిన్ని భవనాలను గుర్తిస్తామని గ్రేటర్ టౌన్ ప్లానింగ్ విభాగం వెల్లడించింది.

రాజేంద్రనగర్ జోన్‌లోనే అత్యధికం

బల్దియా సర్వే గణాంకాల ప్రకారం.. శిథిల భవనాలు అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్ పరిధిలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జోన్ల వారీగా గుర్తించిన శిథిల భవనాల వివరాలు ఇలా ఉన్నాయి:

రాజేంద్రనగర్: 117 భవనాలు

శేరిలింగంపేట: 75 భవనాలు

సికింద్రాబాద్: 70 భవనాలు

చార్మినార్: 56 భవనాలు

గోల్కొండ: 47 భవనాలు

ఖైరతాబాద్: 12 భవనాలు

కమిషనర్ కఠిన ఆదేశాలు.. సెల్లార్ల అనుమతులు రద్దు!

ప్రమాదాల నివారణకు బల్దియా కమిషనర్ సర్కిళ్ల ఉపకమిషనర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పాత కట్టడాలు, బలహీనమైన గోడలను గుర్తించి, అవసరమైన వాటికి ఇంజనీరింగ్ నిపుణులతో సామర్థ్య పరీక్షలు చేయించాలని సూచించారు.

ఏదైనా భవనం నివాసయోగ్యం కాదని తేలితే ఆ ఇంటిని వెంటనే సీజ్ చేయాలని, ముందుగా యజమానులకు నోటీసులు ఇచ్చి, అత్యవసరమైతే తక్షణమే ఖాళీ చేయించాలని స్పష్టం చేశారు. ప్రమాదకర భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ ప్రభుత్వ పాఠశాలలు ఏవైనా శిథిలావస్థలో ఉంటే, వెంటనే విద్యాశాఖకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, వర్ష కాలం పూర్తయ్యే వరకు కొత్త సెల్లార్ల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇచ్చేది లేదని, పాత అనుమతులను కూడా రద్దు చేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు.నగరంలోని కొండలు, గుట్టలపై ఏర్పడిన అనేక కాలనీలలో ఏటా ప్రహరీ గోడలు కూలిపోయే సంఘటనలు ఎన్నో చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోరబండ ప్రాంతాల్లోని ఏటవాలు నేలపై కట్టే ప్రహరీ నిర్మాణాలను వెంటనే ఆపేయాలని జీహెచ్ఎంసీ కోరింది. అక్కడ పనిచేసే కార్మికుల రక్షణ కోసం ఎత్తయిన ప్రాంతాలలో కాకుండా సురక్షితమైన ఖాళీ స్థలాలలో మాత్రమే షెడ్లు నిర్మించాలని కమిషనర్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

# ఖమ్మంలో మున్నేరు నదిపై ఈ కేబుల్ బ్రిడ్జి

ఖమ్మం జూన్ 12, హైదరాబాద్‌లో దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి.. నగరంలో ట్రాఫిక్ తగ్గించడం, మెరుగైన రవాణాతోపాటు.. పర్యాటక పరంగా కూడా చాలా ఉపయోగపడుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి కేబుల్ బ్రిడ్జిలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. హైదరాబాద్‌లోనే మీర్ ఆలం కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నారు. మరోవైపు.. కరీంనగర్‌లో కూడా మానేరు నదిపైనా తీగల వంతెనను నిర్మించారు. వీటితోపాటు ఖమ్మం నగరంలోనూ మున్నేరు నదిపై రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఫైనల్ దశకు చేరుకున్నాయి.కాల్వొడ్డు-జలగంనగర్ మధ్య మున్నేరు నదిపై 1.25 కిలోమీటర్ల పొడవున ఈ తీగల వంతెనను నిర్మిస్తున్నారు. 2 ఏళ్లుగా సాగుతున్న ఈ కేబుల్ బ్రిడ్జి.. పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ వంతెనలో రెండు బాహుబలి పిల్లర్లను ఏర్పాటు చేసి.. వాటి ఆధారంగా స్టీల్ తీగలపై ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఇక నది ప్రాంతంలో 300 మీటర్ల పొడవున వంతెన భాగం తీగలపై వేలాడుతూ ఉంటుంది. దీనికి ఇరువైపులా వయాడెక్ట్, అప్రోచ్ రోడ్లు కలిపి 1.25 కి.మీ.ల పొడవు ఉంటుంది.ఇక ఈ కేబుల్ బ్రిడ్జికి రెండువైపులా అప్రోచ్ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి కావొచ్చింది. 4 వరుసల్లో ఈ కేబుల్ బ్రిడ్జిని నిర్మించగా.. సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్, బ్రిడ్జి పక్కన ఇరు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించాల్సి ఉంది. ఇక ఈ కేబుల్ బ్రిడ్జిని నాలుగు వరుసల్లోనూ తారు వేయనున్నారు. ఈ ఖమ్మం తీగల వంతెన నిర్మాణ పనులు 85 శాతం పూర్తి అయినట్లు ఆర్ అండ్ బీ డీఈ భగవాన్ వెల్లడించారు.రివర్ బెడ్‌లో పనులు మొత్తం పూర్తి చేశామని తెలిపారు. వంతెన పైభాగంలో పనులు 3 నెలల్లో పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో ఖమ్మం తీగల వంతెన వాహనదారులకు అందుబాటులోకి వస్తుందని వివరించారు. ఈ కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే.. వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడమే కాకుండా.. నగరవాసులకు ఒక టూరిస్ట్ స్పాట్‌గా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

# దుమ్ము రేపిసిన పెద్ది...

హైదరాబాద్, జూన్ 12, పెద్ది' జోరు బాక్స్ ఆఫీస్ వద్ద ఇప్పటికీ ఏ మాత్రం తగ్గలేదు. ఓవర్సీస్ , నార్త్ ఇండియా మార్కెట్స్ లో ఈ సినిమా డిజాస్టర్ ఫ్లాప్ గా నిల్చింది కానీ , తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇండస్ట్రీ హిట్ సినిమాకు ఏ రేంజ్ వసూళ్లు వస్తాయో , అదే రేంజ్ వసూళ్లు నమోదు అవుతున్నాయి. దేవర , ఓజీ చిత్రాలను మాత్రమే కాదు , ఏకంగా చఖీఖీఖీ రికార్డ్స్ ని కూడా ఈ సినిమా అనేక ప్రాంతాల్లో బద్దలుకొట్టి సంచలనం సృష్టించింది. డైరెక్టర్ బుచ్చి బాబు స్క్రీన్ ప్లే విషయం లో కాస్త తడబాటు పడినప్పటికీ కూడా, రామ్ చరణ్ అద్భుతమైన నటన తో ఈ సినిమాని వేరే లెవెల్ కి తీసుకెళ్లడం ఆడియన్స్ కి తెగ నచ్చేసింది. అందుకే ఈ చిత్రానికి ఈ స్థాయి వసూళ్లు నమోదు అవుతున్నాయి. 7 వ రోజున ఈ చిత్రానికి దాదాపుగా తెలుగు రాష్ట్రాల నుండి 4 కోట్ల రూపాయలకు పైగా షేర్ వసూళ్లు నమోదు అయ్యాయి. మొదటి సోమవారం కూడా ఈ స్థాయి వసూళ్లు నమోదు అవ్వడం కష్టమైన ఈరోజుల్లో , 7 వ రోజున కూడా ఈ రేంజ్ వసూళ్లు రాబట్టడాన్ని చూస్తుంటే , ఈ సినిమా ఏ రేంజ్ సునామీ ని సృష్టిస్తూ ముందుకు దూసుకుపోతుందో అర్థం చేసుకోవచ్చువారం రోజుల థియేట్రికల్ రన్ ని పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి ప్రాంతాల వారీగా ఎంత షేర్ వసూళ్లు వచ్చింది?, బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకొని లాభాల్లోకి అడుగుపెట్టాలంటే ఇంకా ఎంత వసూళ్లను రాబట్టాలి అనేది ఇప్పుడు మనం చూడబోతున్నాం. ముందుగా నైజాం ప్రాంతం గురించి ప్రత్యేకించి మాట్లాడుకోవాలి. మొదటి నుండి ఈ ప్రాంతం లో ఇలాంటి జానర్ సినిమాలకు ఆదరణ కాస్త తక్కువే. అయినప్పటికీ కూడా ఈ చిత్రానికి కేవలం మొదటి వారం లోనే 46 కోట్ల 58 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఉత్తరాంధ్ర లో కూడా ఈ సినిమా జోరు ఏ మాత్రం తగ్గలేదు. కేవలం వారం రోజుల్లోనే 18 కోట్ల 33 లక్షల రూపాయిల షేర్ వసూలు వచ్చాయి. ఈ ప్రాంతం లో బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అందుకుంది ఈ చిత్రం. ఇక సీడెడ్ ప్రాంతం విషయానికి వస్తే , వారం రోజుల్లో ఇక్కడ 17 కోట్ల 58 లక్షల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టింది.అదే విధంగా ఈస్ట్ గోదావరి నుండి 10 కోట్ల 86 లక్షలు , వెస్ట్ గోదావరి నుండి 7 కోట్ల 64 లక్షలు , గుంటూరు నుండి 11 కోట్ల 14 లక్షలు, కృష్ణా జిల్లా నుండి 8 కోట్ల 67 లక్షలు, నెల్లూరు జిల్లా నుండి 4 కోట్ల 91 లక్షల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టి సంచలనం సృష్టించింది ఈ చిత్రం. ఓవరాల్ గా ఈ చిత్రానికి 125 కోట్ల 71 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు , 186 కోట్ల 60 లక్షల రూపాయిల గ్రాస్ వసూళ్లు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చాయి. అదే విధంగా కర్ణాటక ప్రాంతం నుండి 12 కోట్ల 55 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు ఈ చిత్రానికి రాగా, తమిళనాడు + కేరళ నుండి 2 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. అదే విధంగా హిందీ + రెస్ట్ ఆఫ్ ఇండియా నుండి 9 కోట్ల 45 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు రాగా, ఓవర్సీస్ నుండి 21 కోట్ల 10 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయి. ఓవరాల్ గా ఈ చిత్రానికి 170 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లు , 282 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వచ్చాయి. బ్రేక్ ఈవెన్ మార్కుని అందుకోవడానికి మరో 49 కోట్ల రూపాయిల షేర్ వసూళ్లను రాబట్టాల్సి ఉంటుంది.

## గంజాయి విక్రయిస్తూ ఇద్దరు యువకులు అరెస్ట్, 1.70 కిలోల గంజాయి స్వాధీనం, రిమాండ్ కి తరలింపు

మేడ్చల్ గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం ఖమ్మం పట్టణానికి చెందిన ధనుష్, లోకేష్ అనే ఇద్దరు యువకులు గంజాయికి అలవాటు పడి, ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఘట్కేసర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్లో ఉంటూ అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా వారి వద్ద నుంచి 1 కిలో 70 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఘట్ కేసర్ ఇన్స్పెక్టర్ బాలస్వామి తెలిపారు.

# కాంగ్రెస్ లో ఇంటిదొంగలు

హైదరాబాద్, జూన్ 12,తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన, వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం భారత్ రాష్ట్ర సమితి విమర్శల బాణాలు ఎటువైపు వెళ్తున్నాయో గమనిస్తే ఒక స్పష్టమైన సంకేతం కనిపిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిలో గానీ కాంగ్రెస్ పార్టీని ఒక వ్యవస్థగా పెద్దగా టార్గెట్ చేయడం లేదు. వారి ఏకైక లక్ష్యం, నిరంతర దాడి కేవలం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపైనే కేంద్రీకృతమై ఉంది. తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన వివాదంలో కూడా బీఆర్ఎస్ నేతలు, రేవంత్ రెడ్డి వ్యతిరేక వర్గాలు దీనిని రేవంత్ కుట్రే అన్నట్లుగా ప్రొజెక్ట్ చేస్తుండటం ఈ వ్యూహానికి బలమైన నిదర్శనంగా నిలుస్తోంది.బీఆర్ఎస్ అధినాయకత్వానికి కాంగ్రెస్ భావజాలంపై కంటే రేవంత్ రెడ్డి శైలిపైనే ఎక్కువ అభ్యంతరాలు, భయాలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ముఖ్యమంత్రి అయ్యాక కూడా బీఆర్ఎస్‌ను రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తీయాలనే ఏకైక అజెండాతో దూకుడుగా ముందుకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు, కేసీఆర్ కుటుంబంపై విచారణలు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి అంశాలతో గులాబీ దళాన్ని రేవంత్ రక్షణలో పడేశారు. అందుకే బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే కేడర్‌లో పెద్దగా మైలేజ్ రాదని, రేవంత్ రెడ్డిని పర్సనల్‌గా బలహీనపరిస్తేనే తమకు మళ్లీ పూర్వవైభవం వస్తుందని బలంగా నమ్ముతోంది. తమకు రాజకీయంగా అడ్డుగా నిలిచిన ఏకైక పిల్లర్‌ను కూల్చడమే వారి ప్రధాన లక్ష్యంరాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలకమైన, నిజాయితీ గల నాయకురాలిగా పేరున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ సాంకేతిక కారణాల వల్ల తిరస్కరణకు గురవడం కాంగ్రెస్‌లో పెద్ద కలకలం రేపింది. సీఎం రేవంత్ దీనిని 'బీజేపీ కుట్ర, సీట్ల చోరీ' అని ఢిల్లీ వేదికగా కొట్లాడుతుంటే, ప్రతిపక్షాలు , రేవంత్ అంతర్గత శత్రువులు మాత్రం దీని వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందనే కోణాన్ని తెరపైకి తెస్తున్నారు. రాష్ట్రంలో తన పట్టుకు అడ్డుగా మారే అవకాశం ఉన్న ఢిల్లీ పెద్దలను, హైకమాండ్ ప్రతినిధులను రేవంత్ రెడ్డి కావాలనే ఇబ్బందుల్లో నెడుతున్నారనే ప్రచారాన్ని బీఆర్ఎస్ గట్టిగా సమాజంలోకి పంపుతోంది. ఈ స్నాగ్ ఇష్యూ ద్వారా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద నమ్మకద్రోహిగా నిలబెట్టాలనేది బీఆర్ఎస్ అసలు ప్లాన్.బీఆర్ఎస్ ఆలోచనల వెనుక ఒక లోతైన రాజకీయ లెక్క ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, ఆ పార్టీని నడిపించే 'ఇంజిన్' రేవంత్ రెడ్డే. ఆయన ఢిల్లీ హైకమాండ్ వద్ద బలహీనపడితే లేదా అధిష్ఠానం ఆయనపై నమ్మకం కోల్పోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న పాత అసమ్మతి నేతలు మళ్లీ తలలేపుతారు. తద్వారా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలతో దానంతట అదే బలహీనపడుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. రేవంత్ రెడ్డిని దెబ్బతీస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ కోట కూలిపోతుంది అనే థియరీతోనే బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. అందుకే వారు జాతీయ కాంగ్రెస్‌ను కాకుండా, కేవలం రేవంత్ చుట్టూనే రాజకీయ చక్రవ్యూహాన్ని రచిస్తున్నారు.రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద బలం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీల వద్ద ఉన్న నమ్మకం. ఈ నమ్మకాన్ని చెడగొట్టడానికి బీఆర్ఎస్ నిరంతరం ప్రయత్నిస్తోంది. 'రేవంత్ రెడ్డి ఎప్పటికైనా కాంగ్రెస్‌కు ముప్పు', 'ఆయన తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు', 'ఢిల్లీ పెద్దల నామినేషన్లు రద్దు కావడానికి ఆయనే కారణం' అనే నరేటివ్‌ను ఢిల్లీ స్థాయికి చేర్చడం ద్వారా రేవంత్ రెడ్డి పీఠాన్ని కదిలించవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. సీఎంను ఒంటరిని చేయడం ద్వారా, రాష్ట్రంలో కాంగ్రెస్ దూకుడుకు బ్రేకులు వేయవచ్చని విపక్షం గట్టి వ్యూహాత్మక దాడి చేస్తోంది. ఎంత సక్సెస్ అవుతుందన్నది వేచి చూడాల్సిందే.

## మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నాయకులే కుట్ర చేశారు



భోపాల్ మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నేతలే కుట్ర చేశారని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుండ బద్దలు కొట్టారు. మీనాక్షి నటరాజన్ మీద అసంతృప్తితో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర వల్లే ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైందని ఆయన వ్యాఖ్యానించారు. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగుళూరు తీసుకెళ్లే ప్లాన్ చివరి నిమిషంలో చార్టెడ్ ఫ్లైట్ డిలే వల్ల ఆగిపోవడం లాంటి అంశాలు చూస్తే ఇది ఖచ్చితంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర అని అర్థమవుతుందని ఆయన అన్నారు.

# తెలంగాణ ఫ్యూచర్ సిటీలో మరో 37 గ్రామాలు

హైదరాబాద్, జూన్ 12, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ఫ్యూచర్‌సిటీ దిశగా అడుగులుపడుతున్నాయి. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు రేవంత్ హాజరయ్యారు. ఈ సభ జరుగుతున్న సమయంలో కొంతమంది ఫ్యూచర్‌సిటీలో తమ గ్రామాలను కలపాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఈ అంశాన్ని రేవంత్ దృష్టికి తీసుకెళ్లి సభావేదికపై నిర్ణయం ప్రకటించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించారు. ప్రజలు రిక్వెస్ట్ చేస్తూ తీసుకొచ్చిన పత్రాలపై సంతకం చేసి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో కలపాలని అధికారుల్ని ఆదేశించారు. మహేశ్వరం మండలంలో ఉన్న 28 గ్రామాలు, కందుకూరులోని 9 గ్రామాలు కలిపి 37 గ్రామాలను ఫ్యూచర్‌సిటీలో భాగం కానున్నాయి.అంతకముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.20 కోట్లతో నిర్మించిన ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఛైర్మన్ హోదాలో తన ఛాంబర్‌లో ఫైల్‌పై సంతకం చేశారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పోర్టల్‌ను ప్రారంభించారు. సీఎం రేవంత్‌కు ప్రధాన కార్యకలాపాలను, విభాగాలను ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక వివరించారు. ముఖ్యమంత్రి బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానికుల కోరిక మేరకు తాజాగా కొన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపామని.. భవిష్యత్‌లో గ్రామాల వారీగా చర్చించి ఫ్యూచర్‌సిటీలో కలుపుతామని హామీ ఇచ్చారు. కొంతమంది అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తు?న్నారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో వాళ్లను ప్రజలు తిరస్కరించారని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే వారికి వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. ఫ్యూచర్ సిటీకి అడ్డుపడిన వారి సంగతి ప్రజలు చూసుకుంటారని.. వారే ఈ నగరాన్ని నిర్మించుకుంటారన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు బాగా పెరిగాయని.. సైబరాబాద్ ఒక సాంకేతిక విప్లవంగా తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చిందన్నారు రేవంత్ రెడ్డి. ఇప్పుడు భూమి ధర ఎకరా రూ.200 కోట్లకు పైగా పలుకుతోందన్నారు. రంగారెడ్డి జిల్లా భూములకు బంగారం కంటే ఎక్కువ విలువ ఉందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే నవ్వారని.. ఔటర్ రింగ్ రోడ్డును అడ్డుకున్నారన్నారు. గతంలోనూ నగర అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు, కుతంత్రాలు చేశారని ఆరోపించారు. గత పాలకులు హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, జీనోమ్ వ్యాలీ వంటివి తీసుకురాకపోతే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వచ్చేవా అన్నారు. ప్రజలు ఈ విషయాలను ఆలోచించాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# అటు కేసీఆర్... ఇటు కేటీఆర్...



మెదక్, జూన్ 12, తెలంగాణ రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి తర్వాత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు మైండ్ బ్లోయింగ్ ప్లాన్‌తో పొలిటికల్ గ్రౌండ్‌లోకి దూకేందుకు సిద్ధమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి క్షేత్రస్థాయిలోకి రాబోతుండటం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. తండ్రీకొడుకులు ఇద్దరూ ఒకే వ్యూహంతో, కానీ భిన్న రూపాల్లో ప్రజల ముందుకు రావడం ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది.ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు గులాబీ బాస్ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా భారీ బస్సు యాత్రకు కేసీఆర్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ, నేరుగా ప్రజలతో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్‌లో మళ్లీ మునుపటి జోష్ నింపడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది. ప్రస్తుతం పార్టీ ముఖ్య నేతలు ఈ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఫైనలైజ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త పంథాను ఎంచుకున్నారు. తండ్రి బస్సు యాత్ర చేస్తుంటే, కొడుకు సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. యువతను, సామాన్య ప్రజలను ఆకట్టుకునేలా సుదీర్ఘ కాలం పాటు ఈ పాదయాత్ర సాగనుంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, జనాన్ని పలకరిస్తూ సాగనున్న ఈ యాత్ర పార్టీకి కొత్త ఊపిరి పోస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. తండ్రి బస్సుపై ఉంటూ.. కొడుకు నడుస్తూ జనాన్ని పలకరించే ఈ డ్యూయల్ స్ట్రాటజీ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.ప్రస్తుతం తెలంగాణలో పొలిటికల్ సినారియో పూర్తిగా మారిపోయింది. ఓ వైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రెండు పార్టీలు బీఆర్ఎస్‌ను తీవ్రంగా కార్నర్ చేశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా, ముమ్మందు ఆ పార్టీని మూడో స్థానంలోకి నెట్టేయాలని ఉమ్మడిగా గట్టి వ్యూహాలు రచిస్తున్నాయి.ఇలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తామేంటో, తమ సత్తా ఏంటో చాటాల్సిన అగ్నిపరీక్ష బీఆర్ఎస్‌కు ఎదురైంది. పార్టీని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావాలంటే జనంలోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదని గులాబీ అధిష్ఠానం భావించింది. అందుకే ఇంతకాలం లో-ప్రొఫైల్ మెయింటైన్ చేసిన కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి రోడ్లపైకి వస్తున్నారు.బీఆర్ఎస్ శ్రేణుల్లో ఈ వార్త కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ రెండు యాత్రల పూర్తి షెడ్యూల్, అధికారిక రూట్ మ్యాప్స్ త్వరలోనే విడుదల కానున్నాయి. మరి తండ్రీ కుమారుల స్ట్రాటజీ బీఆర్ఎస్‌ను మళ్లీ రేసులోకి తెస్తుందా? కాంగ్రెస్, బీజేపీల ముకుమ్మడి దాడిని తట్టుకుని గులాబీ పార్టీ పూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# పోలీసులకు రికవర్రీ....

కరీంనగర్, జూన్ 12, కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.ఈ దోపిడీ కేసులో కీలక నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబ్యోద్‌సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైన వాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవా లేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు. తర్వాత ఆభరణాలను కరిగించి వేరే రూపంలో మార్చడం లేదా ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపించడం జరిగి ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నిందితుల మధ్య ఉన్న విరుద్ధ వాదనలు నిజమైన సమాచారాన్ని బయట పెట్టడం లేదు. సైంటిఫిక్ ఫొరెన్సిక్ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లోతైన విశ్లేషణ, ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్, సాంకేతిక పర్యవేక్షణ వంటి అధునాతన పద్ధతులు తప్పనిసరి అవుతున్నాయి.ఈ కేసు పోలీసులకు తలనొప్పిగా మారింది. సుబోధ్ సింగ్ ఇప్పటికే అనేక ఇతర కేసుల్లో ప్రమేయం ఉన్న గ్యాంగ్‌స్టర్ కావడంతో దోపిడీ వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు సమాచారం. పోలీసులు ఇప్పుడు కేవలం నిందితుల వాదనలపైనే ఆధారపడకుండా మరింత లోతైన విచారణ జరపాల్సి ఉంది. సొత్తు రికవరీలో ఆలస్యం జరిగితే నేరస్తులకు ధైర్యం పెరిగి, ఇలాంటి భారీ దోపిడీలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.పోలీసులు ఈ విరుద్ధ సమాచారాలను అధిగమించి, నిజమైన సొత్తు ఆచూకీని త్వరగా గుర్తించి రికవరీ చేయగలరా అనేదే ఈ కేసులో అత్యంత కీలకమైన అంశం. దర్యాప్తు ఎంత సమర్థవంతంగా, ఎంత త్వరగా ముగుస్తుందో అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది.

## వానొస్తే...ఇంతేనా

# హైడ్రా, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం

హైదరాబాద్. జూన్ 12, భాగ్యనగరంలో వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో బల్దియా యంత్రాంగం, హైడ్రా చేసిన ముందస్తు ఏర్పాట్లలోని లోపాలు తొలి వర్షానికే పూర్తిగా బయటపడ్డాయి. వర్షాలొస్తున్నాయంటూ వివిధ ప్రభుత్వ శాఖలతో వరుస సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయిలో జరగాల్సిన సన్నద్ధతపై మాత్రం దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు పిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు, హైడ్రా హడావుడి చూసి అంతా ఆ సంస్థే చూసుకుంటుందనే భావనతో నగరంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు చేతులెత్తేయడంతో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. దీని ఫలితంగా మంగళవారం కురిసిన వర్షానికి నగరవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపైనే నరకయాతన అనుభవించారు.నగరంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం, నాలాల పూడికతీత పనులు సరిగా జరగకపోవడం ఈ ముంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దీనికి తోడు ముంపు సమస్యను తక్షణమే సరిదిద్దే అత్యవసర బృందాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. మే నెల ప్రారంభం నుండే హైడ్రా ఆధ్వర్యంలో వర్షకాల సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించి, అధికారులకు సూచనలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆశించినట్లుగా లేదని ఈ ఒక్క వర్షంతో తేలిపోయింది.హైటెక్స్ సమీపంలోని జూబ్లీగార్డెన్ రోడ్డు నంబర్ 8 లో గతంలో భారీ వర్షం కురిస్తే 20 నిమిషాల పాటు వరద నీరు నిలిచేది. కానీ జూన్ 9న కురిసిన వర్షానికి ఇక్కడి కాలనీలు ఏకంగా నాలుగు గంటల పాటు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రోడ్లపై నడుముల్లోతు నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో మీనాక్షి టవర్స్, వాసవి టవర్స్ వంటి భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులు నిర్మించడంతో సహజ వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ మూసుకుపోయాయి. వరద నాలాల సామర్థ్యం ప్రవాహ మార్గాల గురించి ఆలోచించకుండా ఉన్నతాధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంజనీరింగ్ లోపాలతో రోడ్లు వేయడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, సహాయం చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు ఎవరూ కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రోజంతా కరెంట్ కట్...

కొన్ని గంటల క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బల్దియా పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసింది. విద్యుత్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న కాలనీలు సైతం 24 గంటలకు పైగా కరెంట్ లేక నరకయాతన పడ్డాయి. విపత్తులు తలెత్తినప్పుడు అన్ని విభాగాలు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని సైఫాబాద్, ఆజామాబాద్ డివిజన్లలో అధికారుల తీవ్ర జాప్యం వల్ల వినియోగదారులు కరెంట్ లేక నానాపాట్లు పడ్డారు.

ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడటంతో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగిపోయి, లైన్లు తెగిపడటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను వెంటనే తొలగించినప్పటికీ, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గాంధీనగర్, హెబ్రోన్ చర్చి వీధి, వై జంక్షన్, విద్యానగర్, ఎస్‌బీఐ బ్యాంక్ వీధి, సీపీఎం మార్క్స భవన్ రాష్ట్ర కార్యాలయం వీధి, అడిక్‌మెట్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా సరఫరా పునరుద్ధరించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జోన్ల వారీగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల వివరాలు:

హైదరాబాద్ సెంట్రల్: 56 స్తంభాలు

సికింద్రాబాద్: 11 స్తంభాలు

హైదరాబాద్ సౌత్: 10 స్తంభాలుసైబర్ సిటీ: 8 స్తంభాలు

ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల ఇబ్బందులు

దీర్ఘకాలిక విద్యుత్ కోతల కారణంగా వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచి) పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు చార్జింగ్ లేక లాప్‌టాప్‌లు పనిచేయక, ఫోన్లు స్విచ్ ఆఫ్ అయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కేబుల్ వైర్లు తెగిపోవడంతో ఇంటర్నెట్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. విద్యానగర్, గాంధీనగర్, అడిక్‌మెట్ ప్రాంతాల్లోని 50కి పైగా అపార్ట్‌మెంట్లు, 100కు పైగా ఇండ్లలో కరెంట్ కష్టాలు తలెత్తడంతో వ్యాపారులు అద్దెకు జనరేటర్లను తెచ్చుకుని వ్యాపారాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు నానాయాతన పడ్డారు. కరెంట్ లేకపోవడంతో మోటార్లు నడవక ట్యాంకుల్లో నీరు అయిపోయి, తాగునీటితో పాటు కనీస అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోయిన ప్రైవేటు కార్మికుడు

## విధులు నిర్వహించకుండా ప్రైవేట్ కార్మికులను నియమించుకుంటున్న లైన్ మెన్లు



కోదాడ సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దార్వకుంట గ్రామంలో ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయం రావడంతో సరిచేసేందుకు ప్రైవేట్ కార్మికుడు రెడ్డిబోయిన గోపిని స్థానిక లైన్ మెన్ స్తంభం ఎక్కించాడు. స్తంభం ఎక్కగానే ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో స్తంభం పైనుండి కిందపడి గోపి ప్రాణాలు కోల్పోయాడు. రాష్ట్ర వ్యాప్తంగా పలు విద్యుత్ అధికారులు పని చేయకుండా, ప్రైవేట్ కార్మికులతో పని చేయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

# పిల్లలతో సహా తండ్రి ఆత్మహత్య



నిజాం సాగర్ భార్యతో గొడవపడి తన ఇద్దరు పిల్లలతో కలిసి రిజర్వాయర్లో దూకి భర్త ఆత్మహత్యల చేసుకున్నాడు. నిజాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్లో ఇద్దరు పిల్లలతో కలిసి తండ్రి కృష్ణ(32) దూకాడు. భార్య సవితతో గొడవపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం. కుమారుడు రక్షిత్ (8), కూతురు అనన్య (5)ల మృతుదేహాలు లభ్యం అయ్యాయి. తండ్రి కృష్ణ కోసం రెస్క్యూ టీమ్ గాలిస్తోంది. మృతులు సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన వారిగా గుర్తించారు.

## డ్వాక్రా సొమ్ము దుర్వినియోగం పై

## ఏపీఎం, సీసీ అరెస్టు

పల్నాడు రొంపిచెర్ల మండలం ఒఖఓ సోమేశేఖర్ ను అదుపులోకి తీసుకున్న కాకుమాను పోలీసులుగుంటూరు జిల్లా కాకుమాను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఏపీఎం సోమశేఖర్ గతంలో కాకుమానులో పనిచేశారు ఈ క్రమంలో గరికపాడు గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యుల డబ్బులను దుర్వినియోగం చేశారనే ఫిర్యాదు తో గత నెలలో ఆయన పై కేసు నమోదైంది. ఆ కేసుకు సంబంధించి పొన్నూరు అడిషనల్ జూని యర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరుగుతోంది. అయితే వాయిదాలకు హాజరు కాకపోవడంతో ఏపీఎం సోమశేఖర్, సీసీ సుబ్బారావు, యానిమే టర్, ఇద్దరు గ్రూపు లీడర్లపై నాన్బయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ అయ్యింది. ఈ క్రమంలో ఏపీఎం, సీసీలను అరెస్ట్ చేసి స్టేషన్కు తరలించారు శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరిచారు.

# రైతులకు ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలి

## ఎరువుల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, జూన్ 12 రైతులకు ఎరువుల పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహానంది మండలం బుక్కాపురం గ్రామంలో ఉన్న బైసాని ట్రేడర్స్ ఎరువులు, యూరియా విక్రయ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల పంపిణీకి వినియోగిస్తున్న ఏపీ ఎయిమ్స్ 2.0 ఆన్‌లైన్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. రైతులకు ఎరువులు ఎలా పంపిణీ చేస్తున్నారనే అంశంపై వివరాలు తెలుసుకొని, అందుబాటులో ఉన్న యూరియా, డీఏపీ తదితర ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, ఆన్‌లైన్ రికార్డులను తనిఖీ చేశారు.



ముఖ్యంగా స్టాక్ నమోదు, పంపిణీ విధానం, రైతుల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి ఆధార్ కార్డుతో డీలర్ వద్దకు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. డీలర్ లాగిన్ అయిన అనంతరం రైతు ఆధార్ నంబర్ నమోదు చేయగా, రైతు మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుందని, ఆ ఓటీపీ నమోదు చేసిన తర్వాత రైతుకు సంబంధించిన భూ విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, అవసరమైన ఎరువుల వివరాలు స్క్రీన్‌పై ప్రదర్శితమవుతాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన పరిమితి మేరకు రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ ఎరువులు అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎరువుల కోసం డీలర్ల వద్దకు వెళ్లే ముందు తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రం (ఆర్ఎస్‌కే) ఇంచార్జ్‌ను సంప్రదించి, ఈ-క్రాప్‌లో నమోదైన పంట వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. ఒకవేళ పంట మార్పిడి జరిగి ఉంటే, సంబంధిత వివరాలను సవరించి నమోదు చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా ఇతర మండలాలు లేదా ఇతర ప్రాంతాల్లోని డీలర్ల వద్ద ఎరువులు పొందాలనుకునే రైతులు ముందుగానే ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ద్వారా సంబంధిత డీలర్ల పేర్లను తమ ఖాతాలో జోడించుకోవాలని సూచించారు. ఆర్ఎస్‌కే ఇంచార్జ్ ధృవీకరించి ఆమోదించిన పంట వివరాలు మాత్రమే డీలర్ లాగిన్‌లో కనిపిస్తాయని, వివరాలు ఆమోదం పొందని పక్షంలో రైతుల సమాచారం డీలర్‌కు అందుబాటులో ఉండదని పేర్కొన్నారు.

# మోగిన బడి గంట.

హోళగుంద, :మండల వ్యాప్తంగా శుక్రవారం బడి గంట మోగింది. ప్రధానంగా వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థి,విద్యార్థినీయులు బడి బాట పట్టారు. దీంతో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ముందుగానే ఉపాధ్యాయులు పాఠశాలలను పరిశుభ్రం చేయించారు. అలాగే ఇప్పటికే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఆయా పాఠశాలకు పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ - 1 సుధా రాణి,ఎంఈఓ - 2 కబీర్ సబ్ పాత్రికేయులకు తెలిపారు.

# బీబీనగర్ ఎయిమ్స్ సిబ్బందికి ఆయుధాల అవగాహనా కార్యక్రమం



**యాదాద్రి భువనగిరి ప్రజాబలం ప్రతినిధి:** యాదాద్రి భువనగిరి ఏఆర్ పోలీస్ సిబ్బంది బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రిలో సిబ్బందికి ఆయుధాల పనితీరు, వినియోగ విధానం మరియు భద్రతా అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయుధాలు ఎలా పనిచేస్తాయి, వాటి నిర్మాణం, భద్రతా ప్రమాణాలు మరియు నిర్వహణ విధానాల గురించి సిబ్బందికి వివరించారు. ఆయుధాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల నివారణకు అనుసరించాల్సిన భద్రతా నియమాలను తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రి సిబ్బందిలో ఆయుధాలపై సరైన అవగాహన పెంపొందించి, భద్రతా చైతన్యాన్ని కల్పించారు

ప్రజా భద్రత మరియు అవగాహన పెంపొందించడంలో యాదాద్రి భువనగిరి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆర్ఐ లతీఫ్‌ఉద్దీన్ , ఆర్ఎస్ఐ వెంకటేశ్ మరియు పోలీస్ అధికారులు , హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

# శ్రీకాకుళం జిల్లాలో పరువు హత్య

శ్రీకాకుళం పరువు కోసం కన్న కూతురిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. శ్రీకాకుళం జిల్లా బ్రాహ్మణతర్లాకు చెందిన హరిణి(24)ని, టెక్కలి మండలం సొర్లిగాం గ్రామానికి చెందిన తన మేనమామ దంతేశ్వరరావుకు ఇచ్చి వివాహం చేసారు. వీరికి ఒక కుమారుడు. పెళ్లయ్యాక డిగ్రీ పూర్తి చేసి, గ్రూప్-1 పరీక్షల శిక్షణ కొరకు హైదరాబాద్కు వెళ్ళిన హరిణికి నాగేంద్ర అనే వ్యక్తి పరిచాయం అయ్యాడు. భర్తకు విడాకులు ఇచ్చి అతనిని పెళ్లి చేసుకుంటానని చెప్పిన హరిణిని కుటుంబసభ్యులు పలుమార్లు నిర్బంధించి, కొట్టారు. వీటిపై గతంలోనే బాలానగర్ పీఎస్లో ఫిర్యాదు చేసింది. గత నెల 30న స్వగ్రామానికి వెళ్లి విడాకుల వ్యవహారం గురించి మాట్లాడుదామని హరిణిని తల్లిదండ్రులు తీసుకువెళ్లారు. ప్రమాదాన్ని ముందే గ్రహించిని హరిణి జూన్ 5లోగా తాను తిరిగి రాకపోయినా, ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చినా తనకు ఆపద తలపెట్టి ఉంటారని వీడియో రికార్డ్ చేసి నాగేంద్రకు పంపింది. పథకం ప్రకారమే హరిణిని గత నెల 31 అర్ధరాత్రి హత్య చేసి, గుండెనొప్పితో చనిపోయిందని, ఆత్మహత్య చేసుకుందని బంధువులకు చెప్పి అంత్యక్రియలు కూడా పూర్తి చేసారు కుటుంబసభ్యులు.
5వ తేదీ వరకు ఆమె నుండి ఎలాంటి స్పందన రాకపోవడంతో, వీడియోను శక్తి యాప్లో నాగేంద్ర పంపగా సొర్లిగాం గ్రామానికి వెళ్లి పోలీసులు విచారించారు. హరిణి మరణించి అప్పటికే 6 రోజులు అయిందని తేలింది. దాంతో దర్యాప్తు జరిపి భర్త, తల్లి, తాతను అరెస్ట్ చేసారు.

### గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిపై ప్రమాదం:
### సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లిన కారు..?

గుంటూరు-చిలకలూరిపేట జాతీయ రహదారిపై ఎడ్లపాడు వైన్ షాప్ దగ్గరలో తెల్లవారుజామున ఒక రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుంటూరు వైపు నుండి చిలకలూరిపేట వైపు వెళుతున్న ఒక కారు, తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో అదుపు తప్పి జాతీయ రహదారి పైనుంచి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, కారులో ప్రయాణిస్తున్న వారి వివరాలు మరియు వారికి జరిగిన నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై విచారణ జరుపుతున్నారు.

# టైటిల్ ఫైట్....
# కవిత వర్సెస్ కేటీఆర్



హైదరాబాద్, జూన్ 12,తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ అనే మూడు అక్షరాలు ఇప్పటికీ భావోద్వేగాన్ని, చారిత్రక వారసత్వాన్ని కలిగి ఉన్నాయి. ఆ పేరును తమకు కేటాయించాలని అనేక పార్టీలు ఎన్నికల సంఘం (ఈసీ) ముందు పోటీ పడుతుండగా, బీఆర్ఎస్ నేతలు ఆ పేరు ఎవరికీ ఇవ్వకూడదని ఫిర్యాదు చేశారు. ఇది కేవలం పేరు వివాదం కాదు. ఇది తెలంగాణ ఉద్యమ వారసత్వం ఎవరి చేతుల్లో ఉండాలి, ఓటర్ల ముందు గుర్తింపు ఎలా ఉండాలి అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. 2022లో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకున్నారు. దీంతో టీఆర్ఎస్ ఖాళీగా ఉంది. ఆ పేరు కోసం కొత్త పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇందులో కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' ప్రముఖంగా ఉంది. ఆ పార్టీ పేరు ప్రకటనపై 600కి పైగా అభ్యంతరాలు వచ్చాయి. బీఆర్ఎస్ మద్దతుదారులు, తెలంగాణ ఉద్యమకారులు, సామాన్య ప్రజల నుంచి ఈసీకి ఫిర్యాదులు వచ్చాయి. దీంతో కవిత పార్టీ నేతలు త్వరలో ఎన్నికల సంఘాన్ని నేరుగా కలిసి తమ వాదనను వినిపించనున్నారు. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, మహారాష్ట్రలోని సోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' కూడా టీఆర్ఎస్ పేరును తమకు కేటాయించాలని ఈసీని ఆశ్రయించింది. తెలంగాణ బయటి నుంచి వచ్చిన ఈ ప్రయత్నం, టీఆర్ఎస్ పేరు కేవలం తెలంగాణలోనే కాకుండా, సరిహద్దు ప్రాంతాల్లోని తెలుగు మాట్లాడే ప్రజల్లో కూడా గుర్తింపు కలిగి ఉందని చెబుతోందిభారతీయ రాజకీయాల్లో పార్టీ పేరు కేవలం ఒక లేబుల్ కాదు. అది ఓటర్ల మనసుల్లో నిలిచిపోయిన బ్రాండ్. టీఆర్ఎస్ పేరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంతో ముడిపడి ఉంది. ఆ ఉద్యమంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలకు ఇది గౌరవం, గుర్తు. కొత్త పార్టీ ఆ పేరును ఉపయోగించుకుంటే, ఓటర్లు సులభంగా ఆకర్షితులవుతారు. అదే సమయంలో, బీఆర్ఎస్ తన పాత పేరును రక్షించుకోవాలనుకుంటోంది. పేరు మార్చుకున్న తర్వాత కూడా, ప్రజలు ఇంకా బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గానే గుర్తిస్తున్నారు. ఎన్నికల సంఘం ఈ వివాదంలో కీలక పాత్ర పోషించాలి. పార్టీల నమోదు నిబంధనల ప్రకారం, ఇప్పటికే ఉన్న పార్టీ పేరుకు సమీపంలో ఉన్న పేర్లను అనుమతించకూడదు. ఆఖ ఫిర్యాదు, కవిత పార్టీపై వచ్చిన వందలాది అభ్యంతరాలు, మహారాష్ట్ర పార్టీ కోరిక ఇవన్నీ ఈసీ ముందు ఉన్నాయి. ఈసీ ఒకవేళ కవిత పార్టీకి టీఆర్ఎస్ పేరు ఇస్తే, బీఆర్ఎస్ మద్దతుదారుల్లో అసంతృప్తి పెరగవచ్చు. ఒకవేళ నిరాకరిస్తే, కొత్త పార్టీలు "వారసత్వం అడ్డుకుంటున్నారు" అనే ఆరోపణలు చేయవచ్చు. రెండు వైపులా రాజకీయ లాభనష్టాలు ఉన్నాయి. అందుకే ఈసీ త్వరగా, పారదర్శకంగా నిర్ణయం తీసుకోవాలి. అన్ని పార్టీలను పిలిచి విన్నపాలు విని, స్పష్టమైన కారణాలతో తీర్పు ఇవ్వాలి. ఎన్నికల సంఘం న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తే, ఈ వివాదం తెలంగాణ రాజకీయాల్లో మరింత పరిపక్వతను తీసుకురావచ్చు. లేకపోతే, ఇది మరిన్ని గందరగోళాలకు దారితీసే ప్రమాదం ఉంది. టీఆర్ఎస్ పేరు ఎవరిది అనేది న్యాయస్థానాలు లేదా ఎన్నికల సంఘం నిర్ణయించాలి. కానీ ఆ పేరు వెనుక ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు ఎవరూ దోచుకోకూడదు. అది మాత్రం తెలంగాణ ప్రజలే నిర్ణయించాలి.

# ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం
# మగబిడ్డ స్థానం లో ఆడి శిశువు పెట్టె ప్రయత్నం

కావలి నెల్లూరు జిల్లా కావలి ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. మగబిడ్డ స్థానంలో ఆడపిల్లను పెట్టేందుకు ప్లాన్ బెడిసికొట్టింది. సుప్రజ, శ్రీనివాస్ దంపతులు మగ బిడ్డకు జన్మనిచ్చారు. మగ బిడ్డను మరో దంపతులకు అప్పజెప్పి వారి ఆడ బిడ్డను వీరి దగ్గరకు చేర్చే ప్రయత్నం జరిగింది. అయితే బిడ్డ చేతికి వేసిన ట్యాగ్ తీయకుండానే కుట్రకు ప్రరయత్నం చేసారు. ఆసుపత్రి యాజమాన్యం కుట్రపై శ్రీనివాస్ బంధువులు ఆందోళనకు దిగారు. డాక్టర్ను, యాజమాన్యాన్ని నిలదీసారు. తరువాత ఆసుపత్రి డైరెక్టర్, టీడీపీ నేత శ్రీధర్ వచ్చి బంధువులతో మాట్లాడారు. విషయం బయటకు రానివ్వకుండా పంచాయతీని కప్పిపుచ్చే ప్రయత్నం చేసారని బంధువులు ఆరోపించారు.

## ప్రతి ఒక్కరికి న్యాయపరమైన అంశాలపై అవగాహన అవసరం
## - న్యాయవాది నందిత పాల్

ప్రతి ఒక్కరికి న్యాయపరమైన అంశాలపై అవగాహన అవసరమని న్యాయవాదిని నందిత పాల్ అన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ మానవ జీవిత ప్రతి దశలో న్యాయపరమైన చిక్కులు ఎదురుకోవడం సర్వసాధారణమైనని అలాంటప్పుడు వాటిపై అవగాహనతోనే వాటిని పరిష్కరించుకోగలుగుతామని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాను గత కొన్నేళ్లుగా వైవాహిక సంబంధమైన క్రిమినల్ కార్పొరేట్ సైబర్ క్రైమ్ డిజిటల్ సాక్షాలను సంబంధించిన విషయాలలో కేసులు వాదిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా తోడ్పాటును అందిస్తున్నట్లు చెప్పారు.

## శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆరోపించారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం లేకుండా నేరుగా పాఠశాలలోనే విక్రయిస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ సామగ్రి పేరుతో తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం ఉందని, దీనిపై విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలకు ఈ విధంగా వస్తువులు విక్రయించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, పాఠశాల భవనం నిర్మాణ పనులు పూర్తికాకముందే స్కూల్‌ను ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మరోవైపు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు."విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి తల్లిదండ్రుల జేబులు ఖాళీ చేయడం దురదృష్టకరం. కార్పొరేట్ విద్య పేరుతో జరుగుతున్న ఈ దోపిడీని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అరికట్టాలని లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం" అని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు.

## నమ్మకానికి నిలువెత్తు రూపం..
## రెండేళ్ల ప్రగతి ప్రస్థానం !
## టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ కూటమి ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసిన 'రెండేళ్ల నమ్మకం' ఇటు అభివృద్ధిని, అటు సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తోందని పిడుగురాళ్ల పట్టణ ఆర్యవైశ్య నాయకులు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఆకర్షణ, 20 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాల సృష్టితో యువతకు భరోసానిచ్చింది అన్నారు. అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, దీపం 2.0, స్త్రీ శక్తి వంటి విప్లవాత్మక పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపింది అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా, సుపరిపాలనే ధ్యేయంగా సాగుతున్న ఈ ప్రయాణం రేపటి స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి బలమైన పునాది అన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న చంద్రబాబు, లోకేష్ ల నాయకత్వానికి, గురజాల శాసనసభ్యులు గురజాల నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ, మెడికల్ కాలేజ్, చెరువు వాకింగ్ ట్రాక్, మున్సిపల్ నూతన బిల్డింగు, జానపాడు రోడ్ లో ఆర్.ఓ.బి, లవ్ పిడుగురాళ్ల పేరుతో వాటర్ ఫౌంటెన్, దాచేపల్లి, గురజాల నూతన మున్సిపల్ ఆఫీసు, అమరజీవి జల్ జీవన్ మిషన్, అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న యరపతినేని శ్రీనివాసరావు కి ఇవే మా అభినందనలు అని కనిగిరి శ్రీనివాసరావు అన్నారు.

# సీఎం చంద్రబాబు పాలనకు రెండేళ్ల సందర్భంగా టీడీపీ వినూత్న కార్యక్రమాలు

### తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో వేడుకలు
### వన్ టౌన్ చైనా వాల్ నుంచి దుర్గ గుడి వరకు ర్యాలీ
### దుర్గగుడి ఘాట్ రోడ్డులోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బుద్దా వెంకన్న

విజయవాడ నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి పాలనకు రెండు సంవత్సరాలు పూర్తి అయ్యాయి. మా మహిళలు, తెలుగింటి ఆడపడుచులు... అమ్మవారికి సారె సమర్పించారు. చంద్రబాబు నాయుడు ఆరోగ్యంగా ఉండాలని,ఈ రాష్ట్రాన్ని పరిపాలించేలా మరింత శక్తిని ఇవ్వమని, దుర్గమ్మను కోరుకున్నామని టిడిపి జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న అన్నారు.
జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు గాని, దోచుకున్న విధానం అందరూ చూశారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో విసిగిపోయిన ప్రజలు చిత్తుగా ఓడించారు. వైసిపి మళ్లీవస్తే ఈ రాష్ట్రానికి మనుగడ ఉండదు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉంటే ఈ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుంది. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో కూటమికి 164 సీట్లు ప్రజలు ఇచ్చారు. అమరావతి మునిగిపోతుందని, విజయవాడ మునిగిపోయిందని అబద్దాలు ప్రచారం చేశారు. విజయవాడలో వరదలొస్తే చంద్రబాబు నాయుడు ఏమన్నా తెప్పిస్తారా వరదలు? ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు ఆపడం ఎవరి సాధ్యం కాదు. దైవలీలని ఎవరన్నా అడ్డుకోగలరా? జగన్ ఎదురెల్లి అడ్డుపడతారా. నిన్న మొన్న రెండు గంటలు వర్షం పడితే హైదరాబాద్ లాంటి నగరం మొత్తం మునిగిపోయింది. ఏ రోడ్డు చూసినా సరే నీళ్లు ఉన్నాయి. మరి అలాంటి హైదరాబాద్ ఇవాళ భారతదేశంలోనే నెంబర్ వన్ సిటీ. అమరావతిలో ఎక్కడన్నా ఒక నీళ్ల... ఒక కుంటలో నీళ్లు అయితే దాన్ని డ్రోన్ కెమెరాలతో తీసి అమరావతి మునిగిపోయింది అంటారు. అభివృద్ధికి అడ్డుపడటానికి మాత్రమే జగన్ మోహన్ రెడ్డి తాపత్రయం తప్ప, అభివృద్ధిని నడిపించే నాయకుడికి తోడ్పడదాం అనేది ఎక్కడా లేదు.
చంద్రబాబు నాయుడు అనే వ్యక్తి 76 ఏళ్ళ వయసులో కూడా రోజుకి 20 గంటలు పని చేసి ఈ రాష్ట్రం కోసం, ఈ రాష్ట్ర ప్రజల కోసం, ఈ రాష్ట్ర బాగు కోసం పని చేసే వ్యక్తి. ఆయన భారతదేశంలో రాజకీయాల్లో సూపర్ స్టార్. ఈ వయసులో కూడా ఆయన ముఖ్యమంత్రిగా ఉత్సాహం గా పని చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి మాటలు వినే పరిస్థితిలో జనం లేరు. మీరు మాటలు కట్టిపెట్టి మీకు ఇచ్చిన 11 సీట్లు ఏవైతే ఉన్నాయో, ఆ 11 సీట్లతో అసెంబ్లీలోకి వెళ్లి మీరే దానిమీద మాట్లాడండి. ఎక్కడైనా ఏదైనా జరిగితే దానిమీద మాట్లాడండి, గొంతు ఎత్తండి. మాకు 23 సీట్లు వచ్చినప్పుడు మేము వెళ్ళాం గా మా పార్టీలో నుంచి ముగ్గురు నలుగురు పోయినా సరే మిగతావాళ్ళతో వెళ్లి మాట్లాడారు. చంద్రబాబు నాయుడు కుటుంబాన్ని అవమానించినప్పుడే... 'మళ్ళీ ముఖ్యమంత్రిగానే నేను వస్తాను' అని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు అసెంబ్లీ లోకి అడుగు పెట్టారు. జగన్ ను ఎక్కడా అవమానం జరగలేదు, అసెంబ్లీకి వెళ్తే అందరూ నిన్ను గౌరవించారే, నిన్ను వ్యక్తిగతంగా ఎవరూ మాట్లాడలేదుగా! ఎందుకు మీరు అసెంబ్లీలోకి వెళ్లట్లా? ప్రజా సమస్యల మీద మీ నియోజకవర్గాల గురించి కూడా ఎత్తట్లేదని ప్రశ్నించారు.

# హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

### ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ ఇంచార్జి సెక్రటరీ సచిన్ సావంత్,మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ ఇన్సూరెన్స్ విభాగం చైర్మన్ పవన్ మల్లాది,మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్,7 మండలాల అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు, వైస్ చైర్మన్ లు, కౌన్సిలర్లు, ఇతర ముఖ్య నేతలు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.2002 లో ఓటర్ల సవరణ కార్యక్రమం జరిగినపుడు అర్హత ఉండి ఏ ఒక్క ఓటు మిస్ కావద్దు అని ఎన్నికల కమిషన్ అప్పటి ప్రభుత్వాలు భావించాయి. ఓటరు సవరణ ఉదేశ్యం బీజేపీ కి వ్యతిరేకంగా ఉన్న ఓటు హక్కు తొలగించాలని ఆలోచన తో ఉంది దాని ద్వారా రాజాకి లబ్ధి పొందాలని భావిస్తుందిఏ ఒక్క అర్హత ఉన్న ఓటు తొలగించకుండా మనం జాగ్రత్తగా ఉండాలి.మీ బూత్ లలో ఏ ఒక్క ఓటు పోకుండా చూసుకునే బాధ్యత మన బిఎల్ ఎ లది.ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభం. ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం అత్యంత కీలకం.బూత్ లెవల్ ఏజెంట్లు బిఎ ఏలు ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో కీలక పాత్ర పోషించాలి వారి పని పారదర్శకంగా బాధ్యతాయుతంగా ఉండాలి.ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలి.ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు, సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలి.ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటరు జాబితా ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమైనది. ప్రతి అర్హుడికి ఓటు హక్కు అందేలా ప్రతి బిఎల్ ఏ బాధ్యతతో పనిచేసి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలి.



# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నర్సింహులపేట ఎంపీడీవో, ఎంపీఓ

మహబూబ్ నగర్ నర్సింహులుపేట ఎంపిడీవో, ఎంపివో లంచం తీసుకుంటూ ఏసీబీ దొరికిపోయారు. దాంతో స్థానికులు టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. వారిద్దరూ రూ. 45 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.
మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల పరిషత్ కార్యాలయంలో ఒక వెంచర్ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసి, ఆ డబ్బులు తీసుకుంటుండగా ఎంపీడీవో రాధిక, ఎంపీఓతో పాటు ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఎంపీడీవో కుమారుడిని రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షుడిని సన్మానించిన గౌడ గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియామకమైన గౌడ బాంధవుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను గౌడ ప్రభంజనం సేవా చారిటబుల్ ట్రస్ట్ గౌండ్ల ఆడబిడ్డ రేణుక ఎల్లమ్మ తల్లి గౌడ నిత్యాన్నధాన సత్రం కొండగట్టు ఫౌండర్ అండ్ చైర్మన్ మంద వేణుగోపాల్ గౌడ్, ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ కోల రాజేశం గౌడ్ లు శుక్రవారం బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను శాలువాతో సత్కరించి గౌడ నిత్యాన్నధాన సత్రం జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా మంద వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థులు రాజకీయంగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుండి గౌడ జాతిని అభివృద్ధి దిశగా తీసుకొని వెళ్ళాలని అన్నారు. రాజకీయ పార్టీలు ఏవైనా కాని గౌడ కులస్థులు ఐక్యంగా ఉండి గౌడ కులస్థుల సమస్యలపై పోరాడాలని కోరారు.మా గౌడ నాయకుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ను మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా నియామకం చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం అందుకు సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కొండగట్టు గౌడ నిత్యాన్నధాన సత్రం అభివృద్ధి కమిటీ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు..

# కోచ్ జస్పాల్ రాణా మృతి పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్ భారతదేశంలోని అత్యంత ప్రతిభావంతమైన షూటర్, ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత, భారత క్రీడారంగ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన విశిష్ట కోచ్ జస్పాల్ రాణా మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడల్లో జస్పాల్ రాణా సాధించిన విశిష్ట విజయాలు, అలాగే 1996 అట్లాంటా ఒలింపిక్స్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం దేశానికి ఎనలేని గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిస్టల్ విభాగంలో భారత అత్యున్నత ప్రతిభ కనబరిచిన కోచ్గా ఆయన యువ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో, దేశ షూటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. జస్పాల్ రాణా మరణంతో భారతదేశం ఒక గొప్ప క్రీడాకారుడిని మాత్రమే కాకుండా, తన ప్రతిభ, క్రమశిక్షణ, క్రీడాసేవతో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచే ఓ మార్గదర్శకుడిని కోల్పోయింది" అని ముఖ్యమంత్రి అన్నారు.
ఈ విషాద సమయంలో జస్పాల్ రాణా కుటుంబ సభ్యులు, స్నేహితులు, శిష్యులు, క్రీడా రంగానికి చెందిన వారందరికీ ముఖ్యమంత్రి తీవ్ర సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్.. 24 నెలలు 24 మోసాలు..

### అప్పులు ఫుల్ అభివృద్ధి నిల్.. ప్రచారం పీక్స్ పరిపాలన వీక్ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాధించిన ఘనత ఇదే. వైఎస్ షర్మిల

విజయవాడ కూటమి పాలనంతా మాయాబజార్.. మోసాలమయం. విజన్ లేదు విజ్ఞం అంతకన్నా లేదు. బాబు షూరిటీ లేదు.. భవిష్యత్ కి గ్యారెంటి లేదు. పునర్ నిర్మాణం జరగలేదు..పునరంకితానికి దిక్కులేదని ఏపీసీసీ ఛీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. ఎదే ఉద్ధరిస్తారని అధికారమిస్తే రాష్ట్ర ప్రజలకు పెట్టినవి పెద్ద పంగనామాలు. కూటమి ఇచ్చిన హామీలు గంపెడు.. అమలు చేసింది చిటికెడు. అబద్ధపు మాటలు చెప్పి, మ్యానిఫెస్టోపై మాట తప్పి, స్వర్ణాంధ్ర సాధన జరిగిందని, సుపరిపాలన సాగుతోందని, అభివృద్ధి, సంక్షేమం పేరిట ..విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి పార్టీలకు సిగ్గుండాలి. నిజాలు దాచి అబద్ధాలు ప్రచారం చేయడమంటే నైతికతకు నీళ్ళు వదిలేయడమేనని అన్నారు.
రెండేళ్లుగా ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదు. నెలకు 15 వందలు ఇస్తామని చెప్పిన మహిళాశక్తి పథకానికి దిక్కులేదు. 20 లక్షల ఉద్యోగాల జాడలేదు.. లేకుంటే ఇస్తామని చెప్పిన 3 వేల నిరుద్యోగ భృతికి గతి లేదు. మూడు సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి అంతా సగం సగమే. సూపర్ సిక్స్ ను సూపర్ ఫ్లాప్ చేసి, సూపర్ హిట్ అని చెప్పుకోవడం చంద్రబాబు గారికే సాధ్యం. చేసిన వాగ్దానాలను విలువలేదు . మ్యానిఫెస్టో 143 హామీల అమలుకు అతి గతి లేదు. మెగా డీఎస్సీ దగా డీఎస్సీ చేసి, జాబ్ క్యాలెండర్ ను జాబులు లేని క్యాలెండర్ గా మార్చారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఉన్న పెన్షన్లనే ఊడపీకారు. 10 లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తామని మోసం చేశారు. పేదలకు రెండు లేదా మూడు సెంట్ల భూమి ఇస్తామని మాట తప్పారు. పక్కా ఇండ్లు కట్టిస్తామన్న హామీని తుంగలో తొక్కారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమాన్ని అటకెక్కించారు. కౌలురైతులకు కౌలు కార్డులు దిక్కులేదు. ధరల స్థిరీకరణ అమలు జరగలేదు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు అందలేదు. చివరికి రైతు పండించిన పంట నేలపాలైతే పరిహారం ఇవ్వ చేతకాలేదని విమర్శించారు.
జీవనాడి పోలవరం పూర్తికాలేదు. పెండింగ్ లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులకు ముట్టుకోలేదు. 30 శాతం విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని 15 వేల కోట్ల చార్జీల భారాన్ని మోపారు. ఫీజు రీయింబర్స్ కొనసాగిస్తామని 7 వేల కోట్ల బకాయిలు పెట్టారు. ఆరోగ్యశ్రీకి 3 వేల కోట్ల బకాయిలు ఇవ్వడానికి మనసు రావడం లేదు. పెట్రోల్ , డీజిల్ ధరకు నియంత్రణ అని హామీ ఇచ్చి దేశంలోనే అధిక ధరలు మోపారని అన్నారు.
కేజీ నుంచి పీజీ ఉ ఉచిత విద్య, ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రత్యేక అభివృద్ధి, గ్రామాల్లో మౌలిక వసతులు, జర్నలిస్టులకు ఇండ్లు, ఆక్వా రంగానికి ఊతమంటూ ఇచ్చిన ప్రతి హామీ బూటకమే. విభజన హామీలను విస్మరించి, కేంద్రం నుంచి దక్కాల్సిన నిధులపై మాట మాట్లాడకుండా, ప్రధాని మోడీజీ భజన చేస్తూ, మతాల మధ్య విభజన తెస్తూ, క్రిస్టియన్ మైనారిటీల భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేసి, రాష్ట్రాన్ని మరో 3.50 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేసి పెట్టిన, కూటమి రెండేళ్ల పాలన రాష్ట్రానికి పట్టిన మరో దౌర్భాగ్యమని మండిపడ్డారు.

# అన్నపురెడ్డిపల్లిలో అసంపూర్తి పనుల నిర్లక్ష్యం డివైడర్‌లో ఇరుక్కున్న మూగజీవాలు




అన్నపురెడ్డిపల్లి,() జూన్, 12 భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లిలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరడంతో, తాజాగా సెంట్రల్ లైటింగ్ కోసం నిర్మించిన డివైడర్ కందకంలో ఒక గేదె ఇరుక్కుపోయి దయనీయ స్థితిలో ఉన్న దృశ్యం స్థానికులను కలచివేస్తోంది.?నిర్లక్ష్యానికి నిదర్శనం సెంట్రల్ లైటింగ్ కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడం వల్ల మూగజీవాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేయకపోవడమే కాకుండా, కనీస భద్రతా చర్యలు కూడా చేపట్టకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు.?ప్రజాధనం వృథా – అధికారుల బాధ్యతారాహిత్యం కి?సెంట్రల్ లైటింగ్ ప్రాజెక్టు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.? ఇలాంటి ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.?ప్రభుత్వ ప్రాజెక్టులు ప్రజల సౌకర్యం కోసం ఉండాలి కానీ, ఇలా మూగజీవాలకు మరణశాసనంగా మారడంపై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.?వెంటనే అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ పనులను పూర్తి చేయాలని, అలాగే ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# పట్టాల పంపిణీతో భావితరాలకు శాశ్వత భూ హక్కులు.

# మంత్రి దనసరి అనసూయ సీతక్క.





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 12 ములుగు**99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మల్లంపల్లి మండలంలోని గిత్తూర్ తండా, కొడిశాలకుంట, ముద్దునూరు తండా, రామచంద్రపూర్, భూపాల్‌నగర్, శివతండ గ్రామపంచాయతీల పరిధిలోని ప్రజల నుంచి మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

ప్రత్యేకంగా రామచంద్రపూర్ గ్రామ పరిధిలో సుమారు 10,600 ఎకరాల భూములకు సంబంధించిన 30 నుంచి 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించి, రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతులకు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

భూముల సమస్యల పరిష్కారంతో పాటు రైతులకు పూర్తి స్థాయిలో వ్యవసాయ భరోసా కల్పించేందుకు రెండు పంటలకు సమృద్ధిగా సాగునీరు అందించే ప్రత్యేక ప్రణాళికలను ప్రభుత్వం రూపొందిస్తోందని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఇళ్లులేని నిరుపేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు మొదటి విడతలో ములుగు నియోజకవర్గానికి 5 వేలకుపైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందించేలా కార్యాచరణ కొనసాగుతోందన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ త్వరితగతిన పరిష్కార చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

సామాజిక భద్రతలో భాగంగా అర్హులైన వారికి త్వరలోనే నూతన పెన్షన్లు మంజూరు చేసి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.

మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని, మహిళా సంఘాలకు విశిష్ట గౌరవం కల్పిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను అందించామని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో మరింతగా ఎదగడానికి రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న గోదాములు మహిళా సంఘాల వీవో భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. నూతన అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.

ప్రజలు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వమే గ్రామాలకు వెళ్లి సమస్యలను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం చూపించే విధానాన్ని అమలు చేస్తున్నామని, ప్రతి దరఖాస్తును బాధ్యతగా తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రధానంగా పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, భూ సమస్యలు, గ్రామస్థాయి స్థానిక సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని తెలిపారు. ఈ నాలుగు ప్రధాన విభాగాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రామాణిక ఫార్మాట్ రూపొందించామని, ఫిర్యాదుదారులు సంబంధిత అంశంపై వివరాలు నమోదు చేసిన వెంటనే ఎంపీడీఓ, ఎంపీఓ, తహసీల్దార్ స్థాయిలో పరిశీలన చేపడతామని చెప్పారు. జిల్లా స్థాయిలో పరిష్కారం సాధ్యమైతే వెంటనే చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర స్థాయిలో పరిష్కారం అవసరమైతే సంబంధిత శాఖల ప్రధాన కార్యాలయాలకు పంపించి త్వరితగతిన పరిష్కరించే చర్యలు చేపడతామని తెలిపారు.

అంతకుముందు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మల్లంపల్లి మండలం రామచంద్రపూర్ గ్రామ పరిధిలోని యేసునగర్‌లో సీఆర్ఆర్ 2025-26 నిధులతో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి దుర్గామాత ఆలయం వరకు రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, అలాగే డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన దుర్గామాత దేవాలయ కాంపౌండ్ వాల్‌ను మంత్రి ప్రారంభించారు.

అనంతరం కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కలెక్టర్‌తో కలిసి మెగా శానిటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

“అమ్మ మాట -- అంగన్‌వాడి బాట అంగన్‌వాడీలో పిల్లలను నమోదు చేయండి, వారి భవిష్యత్తుకు పునాది వేయండి” అనే నినాదంతో ములుగు ప్రాజెక్టు మల్లంపల్లి సెక్టార్ రామచంద్రపూర్ యేసునగర్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు.

రామచంద్రపూర్ ప్రజా దర్బార్ కార్యక్రమం అనంతరం మంత్రి అనసూయ సీతక్క అంగన్‌వాడీ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మెన్ బొక్క సత్తిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ.

## కోటి 30 లక్షలతో ఇండ్ల నిర్మాణం మంత్రి సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 12** మల్లంపల్లి శుక్రవారం మల్లంపల్లి మండలంలోని ముద్దునూరు తండ గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో 30 ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరు, శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరయ్యారు.



ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి, మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి., ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించాలి.

### పాఠశాలల పునఃప్రారంభానికి ముందే హాస్టళ్లలో పరిశుభ్రత, భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలి.

### విద్యార్థుల భద్రత కోసం మెగా శానిటేషన్ కార్యక్రమం మంత్రి సీతక్క.

**ములుగు ప్రజాబలం ప్రతినిధి జూన్ 12 ములుగు**శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని గడిగడ్డ షెడ్యూల్డ్ కులాల బాలికల వసతి గృహంలో నిర్వహించిన శానిటేషన్ డ్రైవ్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి పాల్గొని వసతి గృహంలోని గదులను పరిశీలించారు.



ఈ సందర్భాల్లో మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాలలు, వసతి గృహాలకు చేరుకునే ముందు వసతి గదులు, తరగతి గదులు, వంటశాలలు, హాస్టళ్ల పరిసరాలు పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సెలవుల సమయంలో మూసివున్న భవనాల్లో పాములు, తేళ్లు, జెర్రులు వంటి ప్రమాదకర జీవులు చేరే అవకాశం ఉన్నందున పిల్లల భద్రత దృష్ట్యా స్కూల్ రీఓపెనింగ్‌కు ముందే ప్రత్యేక మెగా శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డీఈఓ, హాస్టల్ వార్డెన్లు, ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మెగా శానిటేషన్ కార్యక్రమానికి అవసరమైన సూచనలు జారీ చేశామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాలోని పాఠశాలలు, హాస్టళ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు.

పిల్లలు వచ్చిన తర్వాత ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, ఈ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తే విద్యార్థులకు మరింత సురక్షిత వాతావరణం కల్పించవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వికాస్ మీనా, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, సూపరిండెంట్ చంద్రశేఖర్, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,స్థానిక కాన్సిలర్లు,జిల్లా అధికారులు, వైద్యాధికారులు,కో ఆప్షన్ సభ్యులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్స్ వీడండి వస్త్ర సంచులను వాడండి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 12 ములుగు** 99 రోజుల “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో “వస్త్ర సంచులు మరియు పునర్వినియోగ పాత్రల ప్రోత్సాహం” కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ (రెవెన్యూ), మున్సిపల్ చైర్‌పర్సన్ మరియు కమీషనర్ పాల్గొని వస్త్ర సంచుల వినియోగాన్ని ప్రోత్సహించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారి శ్రీమతి వి. అరుణ దేవి, అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ సైంటిస్ట్ ఽ నోడల్ అధికారి, మున్సిపల్ కార్యాలయం మరియు జిల్లా కార్మిక శాఖ అధికారి సహకారంతో వ్యాపారులు, దుకాణదారులు మరియు వినియోగదారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై మరియు పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మరియు బహిరంగ ప్రదేశాలలో ప్రజలకు వస్త్ర సంచులను పంపిణీ చేయడం జరిగింది.

## దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం

## రూ.50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా (జూన్ 12) : ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు.వారిలో ఇద్దరు దివ్యాంగులు.దివ్యాంగురాలైన సాగరిక,దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు.వారికి ప్రభుత్వ,ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు.ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు.పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది.కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు.జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు.దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు.భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ.లక్ష్మీరాజంను జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.

## బుల్లెట్ ట్రైన్ కోసం ప్రధానికి పోస్ట్ కార్డులు పంపిన మహిళలు



**జహీరాబాద్, జూన్ 12 ప్రజా బలం ప్రతినిధి:** ముంబై- హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ పట్టణం మీదుగా నడపాలని కోరుతూ మహిళలు ప్రధాని నరేంద్ర మోడీకి లేఖలు పంపారు. మున్సిపల్ కౌన్సిలర్ స్రవంతి రవి కిరణ్ ఆధ్వర్యంలో మహిళలు ప్రధానికి పోస్ట్ కార్డు లు పంపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని జహీరాబాద్ మీదుగా ప్రతిపాదించి అనంతరం వికారాబాద్ మీదుగా మళ్లించారన్నారు. జహీరాబాద్ ప్రాంత రైతులు పారిశ్రామిక అభివృద్ధి కోసం వేలాది ఎకరాల భూములను త్యాగం చేశారన్నారు. జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనపై ఆలోచించి జహీరాబాద్ మీదుగా నడిచేలా డి పి ఆర్ తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త మేడం సుధా, బిజ్జల కవిత, చింతా రేఖ, అర్థం సౌజన్య 27వ వార్డు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే ఎమ్మెల్యే మాణిక్ రావు



**జహీరాబాద్, జూన్ 12 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్రంలో 2028 లో జరిగే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో గత మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరపున పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిన పలువురు అభ్యర్థులను వారినివాసాలకు వెళ్లి పరామర్శించారు. సందర్భంగా వారికి ధైర్యాన్ని కల్పించి, అండగా ఉంటానని అధైర్యపడవద్దని ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే తో పాటు కౌన్సిలర్ తంజుం, నాయకులు జాఫర్, అక్బర్, దత్తాత్రి, పద్మజ తదితరులున్నారు

## అందమైన గృహానికి అద్భుతమైన ఏషియన్ పెయింట్స్ కలర్స్, నాణ్యమైన ధరలకు అందిస్తున్న రాయల్ ఎలక్ట్రానిక్ ప్రోపరేటర్ మహమ్మద్ గౌసోద్దీన్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జూన్ 12(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం అందమైన గృహానికి అద్భుతమైన కలర్స్ అందిస్తున్న ఏషియన్ పెయింట్స్ రండి కొనండి అని రాయల్ ఎలక్ట్రానిక్ ప్రొప్రైటర్ మొహమ్మద్ గౌసో ద్దీన్ తెలిపారు ఎమ్మార్వో ఆఫీస్ రోడ్ ప్రభుత్వ ఆసుపత్రి గేటు ఎదురుగా మీకు నచ్చేలా మీరు మెచ్చేలా అందమైన అద్భుతమైన కలర్స్ మీ ముందు ఉంచబడ్డాయి అని తెలిపారు క్వాలిటీ విషయంలో నెంబర్ వన్ నాణ్యమైన అద్భుతమైన కలర్స్ రాయల్ ఎలక్ట్రానిక్ షాప్ లో కలర్స్ ఉన్నాయని నారాయణరెడ్డి తెలిపారు





## రాజన్న ఆలయానికి రూ.1,21,111 విరాళం



**ప్రజాబలం దినపత్రిక వేములవాడ ప్రతినిధి జూన్ - 12** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి కొరకు గురువారం రోజున ఆలయ రిటైర్డ్ ఏఈఓ శ్రీ బ్రహ్మన్న శ్రీనివాస్ - అరుణ దంపతులు రూ. 1,21,111/- రూపాయలు ఆలయ ఈఓ రమాదేవికి విరాళాన్ని అందజేశారు.ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పన, దేవస్థాన సేవా కార్యక్రమాల విస్తరణకు తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు వారు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు ఈఓ కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారం, దాతల ఉదారతతో రాజన్న ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

## ఈనెల 13న విద్యుత్ సరఫరా నిలిపివేత

**జహీరాబాద్, జూన్ 12 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 13న విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కె.వి సబ్ స్టేషన్ లో అత్యవసర మరమ్మత్తుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## ఆందోల్ మండలంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహణ



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 12 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని, 7, గ్రామాలలో నేరేడుగుంట,అన్నసాగర్,చింతకుంట, డాకూర్, రోళ్లపాడు, తలెల్మా,ఎర్రారం, గ్రామపంచాయతీలలో, ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు, గ్రామాలలో ఉన్న ప్రజల సమస్యలను, సమావేశ దృష్టికి తీసుకురాగా, తత్వర పరిష్కారానికి కృషి చేస్తామని, గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, అధికారులు కోరారు, నేరేడుగుంట, గ్రామపంచాయతీలో జరిగిన, ప్రత్యేక గ్రామసభకు, మండల ప్రత్యేక అధికారి ఆలీమ్, ఎంపీడీవో, రాజేష్ కుమార్, ఎంపి ఓ, రవీందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం సభ్యులు, ఇతర అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సంగారెడ్డి ఎమ్మెల్యేను ఆహ్వానించిన తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 12 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :తెలంగాణ యూత్ జర్నలిస్ట ఫెడరేషన్ (టీ వై జె ఎఫ్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, సంగారెడ్డి ఎమ్మెల్యేను మరియు సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు బిక్షపతిను,మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు,

ఈ నెల 14వ తేదీ ఆదివారం తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ఆధ్వర్యంలో నిర్వహించనున్న, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని,వారు కోరారు, ఈ సందర్భంగా జర్నలిస్టుల సంక్షేమం, మీడియా రంగ అభివృద్ధి, యువ జర్నలిస్టుల పాత్రపై చర్చించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ. జగత్ కృష్ణ, సంగారెడ్డి జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ అశోక్, జిల్లా కార్యదర్శి.కామగల్ల నరేష్,విజయ్,అబూబాకర్, తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ సమ్మేళనం జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం మరియు వృత్తి అభివృద్ధికి దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు...



## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం... జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### యాసంగి ధాన్యం కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఏటీసీ ప్రవేశాలపై మీడియా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, జూన్ 12, ప్రజాబలం ప్రతినిధి** :రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మీడియా సమావేశం నిర్వహించి యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్ డ్ ట్రైనింగ్ సెంటర్ల ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వంద శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 2024-25 యాసంగి సీజన్ లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా, ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు. సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2024-25 ఖరీఫ్‌లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025-26 ఖరీఫ్‌లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్‌లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు.ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహనాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 18,191 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, తొమ్మిది కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 26 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న కొనుగోలు చేయగా, ఇప్పటికే రూ.14.84 కోట్ల చెల్లింపులు చేసినట్లు చెప్పారు. మొక్కజొన్న నిల్వ కోసం 29 వేల మెట్రిక్ టన్నుల స్థలాన్ని గుర్తించామని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మైనర్ రిపేర్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సమీక్ష సమావేశం



**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** కామారెడ్డి జిల్లా శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మైనర్ రిపేర్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం తన చాంబర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న మైనర్ రిపేర్ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

అలాగే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతిరోజూ సంబంధిత కళాశాలలను సందర్శించాలని, ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ అంజయ్య, కామారెడ్డి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు.

# “ప్రతి చిన్నారికి విద్య -- ప్రతి చిన్నారికి బాల్యం” అనే లక్ష్యంతో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

## బాలకార్మిక నిర్మూలన పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి ప్రజాబలం ప్రతినిధి** కామారెడ్డి జిల్లా శుక్రవారం ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్అన్నారు.



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాల్యం అనేది ప్రతి చిన్నారి హక్కు అని, పిల్లలు విద్యను అభ్యసిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, హోటళ్లు, దుకాణాలు, పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల్లో బాల కార్మికులను నియమించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపాలని, బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రతినిధులు, పౌర సమాజం భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.“ప్రతి చిన్నారికి విద్య -- ప్రతి చిన్నారికి బాల్యం” అనే లక్ష్యంతో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# ప్రధాని మాట తప్పారు .విహెచ్



బిజెపి బిసిల వ్యతిరేక పార్టీగా ముద్ర వేసుకుందని మాజీ ఎంపీ , ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆరోపించారు. జాతీయ జనగణన లో బిసి కులగణన చేపడతామని స్వయానా ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించి , మాట తప్పరని విమర్శించారు. జాతీయ జనగణనలో బిసిల కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ...




విహెచ్ హైదరాబాద్ కోఠి లోని తెలంగాణ జనగణన శాఖ డైరెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిసి జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షులు ముతా రోహిత్. టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఆర్ లక్ష్మణ్ యాదవ్ పీసీసీ ఉపాధ్యక్షులు అప్సర్ యూసుఫ్ జహి. పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్ గౌడ్.పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దేశంలో ఉన్న 60 శాతం మంది బిసిలకు ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తున్నారని మండిపడ్డారు. బిసిల లెక్కలు తేలితేనే రాజ్యాధికారం దక్కుతుందని అన్నారు. జాతీయ జన గణన లో బిసి కుల గణన చేపట్టకపోతే బీసీలందరు జనగణనను బహిష్కరిస్తారని హెచ్చరించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి , కేంద్ర మంత్రులను అడ్డుకోవడంతో పాటు... ప్రధాని పర్యటనలో తమ నిరసనలు తెలియజేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనగణన శాఖ డైరెక్టర్ భారతి హోలీ కేరీ ను కలిసి వినతిపత్రం అందజేశారు.

# మానవత్వం చాటుకున్న జిల్లా కలెక్టర్ బాధిత కుటుంబానికి తక్షణ వైద్య సహాయం

## రూ. 50 వేల చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ -12 (ప్రజాబలం ప్రతినిధి)**ఇద్దరు దివ్యాంగుల వైద్యానికి ఆర్థిక సహాయం అందజేశారు.బోయినపల్లి మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన కళ్యాణం కొమురవ్వకు నలుగురు పిల్లలు. వారిలో ఇద్దరు దివ్యాంగులు. దివ్యాంగురాలైన సాగరిక, దివ్యాంగుడైన వేణు అనారోగ్యానికి గురయ్యారు. వారికి ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటల్లో వైద్యం చేయించారు.కొమురవ్వ భర్త గల్ఫ్ కు వెళ్లి అక్కడే మరణించారు. ఆమెకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను కలిసి తమ ఇబ్బందులను విన్నవించారు. పిల్లలను చూసుకోవడం కోసం తాను ఇంటికే పరిమితమై పోయినది. కూలి పనులకు సైతం కూడా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నారు. జిల్లా కలెక్టర్ తక్షణం స్పందించి జిల్లా సంక్షేమ అధికారితో విచారణ చేయించి వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. దీంతో వారికి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. భవిష్యత్తులో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తమ పిల్లలకు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్ కు కొమురవ్వ కృతజ్ఞతలు తెలియజేశారు.



# వికారాబాద్ రాజీవ్ పంచాయతీ రాజ్ సమావేశంలో స్పీకర్ తో ప్రశంస పత్రం అందుకున్న పట్లూర్ సర్పంచ్ పరుశురాం

## ముఖ్యఅతిథిగా సమావేశంలో పాల్గొన్న తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 12(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**వికారాబాద్ చాయ్ ఇన్ బంకిటల్ ఎన్నేపల్లి దగ్గర వికారాబాద్ నియోజకవర్గం వివిధమండలలకాంగ్రెస్ సర్పంచులకు రాజీవ్ పంచాయతీ రాజ్ సర్పంచులస్వాగతం సమావేశంలో వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా సమావేశంలో పాల్గొనడం జరిగింది అని తెలిపారు సమావేశంలోపట్లూర్ గ్రామ సర్పంచ్ పరుశురాం పాల్గొన్న టుతెలిపారు సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రణాళికలు సూచనలు స లహాలు కాంగ్రెస్ ప్రభుత్వం 70 సంవత్సరాల నుండి ప్రజలకు చేస్తున్నటువంటి సేవలు అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చర్చిస్తూ కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ప్రజల సంక్షేమం గురించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకొస్తున్న ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ గ్రామాల అభివృద్ధికి గ్రామ ప్రథమ పౌరుడిగా గ్రామ సర్పంచ్ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు





# ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అభినందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



రాజన్న సిరిసిల్ల జిల్లా (జూన్ 12) సిరిసిల్ల బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాల లో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ అభినందించారు.తంగళ్ళపల్లి మండలంలోని బాలికల టీజీఎంఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో బుష్ర కౌసర్ 1000 మార్కులకు గాను 985 మార్కులు,బైపీసీ విభాగంలో ఎం.నందిని 1000 మార్కులకు గాను 977 మార్కులు సాధించినందుకు ప్రతిభా పురస్కారం ఒక్కరికి రూ.15 వేల చొప్పున ఇద్దరికి మొత్తం రూ.30వేలు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేసి అభినందించారు.కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి అయేషా తలత్,సంబంధిత పాఠశాలల ఇంచార్జి ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com